Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 329 | పేజీలు 8 | వెల : 5 | మంగళవారం 06 మే 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

# 5 లక్షల కొలువులకు కార్యాచరణ



అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా సంవత్సరంలో ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించేలా తమ ప్రభుత్వం వినూత్న కార్యాచరణను రూపొందిస్తోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పట్టభద్రులందరికీ ఒక నైపుణ్య పరీక్ష నిర్వహించి, ఫలితాల ఆధారంగా పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల సంతృప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలను సచివాలయంలో మంత్రి విలేకర్లకు వెల్లడించారు. 'ఇప్పటికే 1,000 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి నైపుణ్య పరీక్ష నిర్వహించాం. వారిలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎటువంటి శిక్షణ లేకుండా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. మిగతా పట్టభద్రులకు కొంచెం నైపుణ్య శిక్షణను అందించాలి. దానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇలాంటి పరీక్షలు నిర్వహించి, నైపుణ్యాలు కల్పించడానికి ఒక వ్యవస్థను తయారుచేస్తాం. అవసరమైతే విశ్వవిద్యాలయాలు, మంచి పేరున్న కళాశాల సమన్వయంతో ఇవన్నీ చేస్తాం.

**దేశంలో ఎక్కడా లేని విధంగా సంవత్సరంలో ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించేలా తమ ప్రభుత్వం వినూత్న కార్యాచరణను రూపొందిస్తోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పట్టభద్రులందరికీ ఒక నైపుణ్య పరీక్ష నిర్వహించి, ఫలితాల ఆధారంగా పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు.**


### సేవలపై ప్రజల సంతృప్తి పెరుగుతోంది

'ప్రభుత్వం అందిస్తున్న అనేక సేవలు, పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయి? అధికారులు ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా? ఈ పథకాలు అందించడంలో ఏదైనా అవినీతి చోటు చేసుకుంటుందా.. అని సర్వే చేశాం. ప్రజల్లో ప్రతినెలా సంతృప్తస్థాయి పెరుగుతోంది. 87.8 శాతం మంది లబ్ధిదారులు తమకు ఇంటి వద్దే పింఛను అందుతోందని చెప్పారు. పింఛను అధికారి ప్రవర్తన 85 శాతం మంది బాగుందన్నారు. పింఛను అందించే అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని చాలా తక్కువ మందే చెప్పారు. అధికారుల ప్రవర్తనపై కూడా ముఖ్యమంత్రి ఆరా తీశారు. లబ్ధిదారులను సంతృప్తి పరచాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు. రెవెన్యూ సేవలు, హౌసింగ్ శాఖలపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నట్లు సర్వేలో తేలింది' అని వివరించారు.

### మరింత మెరుగ్గా వాతావరణ హెచ్చరికలు

'విపత్తుల నిర్వహణశాఖ హెచ్చరికలను మరింత మెరుగ్గా అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నెల రోజుల్లో 30 రకాల సేవలను అందించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వాటిలో భూగర్భ జలాలు, వేడిగాలులు, వర్షపాతం, తుపానులు, పిడుగుల వంటి సమాచారాన్ని సాధ్యమైనంత కచ్చితంగా ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు' అని వివరించారు. 'వాట్సప్ గవర్నెన్స్‌లో జనవరి 30 నుంచి ఏప్రిల్ 25 వరకు దాదాపు 73.1 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 36.38 లక్షల దరఖాస్తులను పరిష్కరించాం. ప్రస్తుతం వారానికి దాదాపు 7 లక్షల దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో సగానికి పైగా పరిష్కరిస్తున్నాం' అని తెలిపారు. మద్యం విషయంలో వైకాపా ప్రభుత్వం చేసిన తప్పులన్నీ ఇప్పుడు బయటపడుతున్నాయని, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

# ఏడాది పొడవునా పర్యాటక వేడుకలు



అమరావతి: రాష్ట్రంలో రూ.12,565 కోట్ల పెట్టుబడితో 8,073 గదుల సామర్థ్యం గల 69 హోటళ్లు, రిసార్టులు నెలకొల్పేందుకు వివిధ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు పర్యాటకాభివృద్ధి శాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించారు. పర్యాటకశాఖపై సచివాలయంలో సమీక్ష సందర్భంగా ఈ రంగంలో వివిధ సంస్థలు పెట్టనున్న పెట్టుబడుల గురించి వారు సీఎంకు వివరించారు. త్వరితగతిన అనుమతులు, రాయితీలు అందించి ప్రాజెక్టులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. పర్యాటక రంగం అభివృద్ధికి పలు ఆదేశాలిచ్చారు. 'రాష్ట్రంలో ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించేలా 'టూరిజం ఫెస్టివల్ క్యాలెండర్' రూపొందించాలి. అన్ని పర్యాటక ప్రదేశాల్లోనూ ఆయా ప్రాంతాల ప్రాముఖ్యాన్ని బట్టి కార్యక్రమాలు చేపట్టాలి. 'హోం స్టే' రంగం అభివృద్ధికి ప్రత్యేక విధానం తీసుకురావాలి. పర్యాటకులను ఆకట్టుకునేందుకు డాల్ఫిన్ షోలు ఏర్పాటు చేయాలి. వీలైనన్ని ఎక్కువ ప్రాజెక్టులు రూపొందిస్తే వాటిని చేపట్టేందుకు దేశంలోని ప్రఖ్యాత సంస్థలు ముందుకొస్తాయి. పర్యాటకులను ఆకట్టుకునేలా ఆక్వేరియంలు ఏర్పాటు చేయాలి. గండికోటకు 'యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్' గుర్తింపు వచ్చేలా కృషి చేయాలి. 'ప్రసాద్' పథకంలో సింహాచలం, అన్నవరంలో పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి. రాష్ట్రమంతా 150 అరకు కాఫీ స్టాళ్లు నెలకొల్పాలి. భవానీ ద్వీపం సహా ఇతర ఐలాండ్ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి' అని సీఎం ఆదేశించారు.

### సృజనాత్మక నగరంగా అమరావతి

'అమరావతిని సృజనాత్మక నగరం (క్రియేటివ్ సిటీ)గా చేయాలి. క్వాంటం కంప్యూటింగ్ తర్వాత క్రియేటివ్ ఎకానమీకి ప్రాధాన్యమివ్వాలి. సింగపూర్ తరహాలో రాష్ట్రంలోనూ నైట్ సఫారీపై అధ్యయనం చేయాలి. కొండపల్లి, కూచిపూడి, కడియం, మంగళగిరి, చీరాల, బాపట్ల, అరకు సహా 50 చోట్ల ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటుచేయాలి. వీటిలో సేంద్రియ వ్యవసాయం, ఇతర రంగాలను చేర్చాలి. అమరావతి, విశాఖలో ఆరోగ్య పర్యాటకం (హెల్త్ టూరిజం) ప్రమోట్ చేయాలి. 20 దేవాలయాల్లో ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధి చేయాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు.



## దెబ్బతిన్న పంటలను పరిశీలించండి

రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి

వైకాపా శ్రేణులకు జగన్ సూచన

2లో..



## తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి నాదెళ్ల

ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీగా నష్టం

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

2లో..

# ఉపాధి అవకాశాలే లక్ష్యం..

## ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థతో ఏపీ ఒప్పందం

**ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా విద్య, ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.**



అమరావతి: ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుపుచ్చుకునేందుకు ప్రతిభావంతులైన బృందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఎన్ఏసీ శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన ట్రెనింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు.పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో 9వేల మంది యువతకు శిక్షణ ఇస్తారు. శిక్షణా పరికరాలు, వినియోగ వస్తువులు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ సుమారు రూ.5 కోట్లు ఖర్చుచేయనుంది. మంగళగిరిలో రూ.15 కోట్లతో ఎలక్ట్రిక్ సెంటర్ ఏర్పాటుకు ష్నైడర్ అంగీకారం తెలిపింది. అంతేకాకుండా అనంతపురంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ష్నైడర్ ఎలక్ట్రిక్ మోడ్రన్ పవర్ ఆప్టిమైజేషన్ పైలట్ ప్రాజెక్టు చేపట్టనుంది. మరోవైపు అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో శిక్షణ కోసం ఒరాకిల్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఒరాకిల్ మై లెర్న్ ప్లాట్‌ఫామ్ ద్వారా మూడేళ్లలో 4లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు మంత్రి లోకేశ్ సమక్షంలో ఒరాకిల్, ఏపీఎస్ఎస్‌డీసీ మధ్య ఎంవోయూ కుదిరింది.



## వర్రా అరెస్ట్‌పై తప్పుడు అఫిడవిట్లు పోలీసులకు హైకోర్టు అక్షింతలు

**విజయవాడ:** పోలీస్ అధికారులపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీందర్‌రెడ్డి కేసులో అరెస్ట్ సమయం, తేదీపై తప్పుడు అఫిడవిట్లు ఇచ్చారని ఫైరయ్యింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు వేసిన అఫిడవిట్లలో సమాచారం తప్పని హైకోర్టు తేల్చింది. 2024 నవంబర్ 8న అరెస్ట్ చేసి 10న చేశామని ఎలా చెప్తారని ప్రశ్నించింది. తాము తీసుకోబోయే చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలని హైకోర్టు సూచించింది. సోషల్ మీడియాలో తమకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని కూటమి ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో వైఎస్సార్ జిల్లాకు చెందిన వర్రా రవీంద్రారెడ్డిపై అక్రమ కేసులు బనాయించింది. పులివెందుల అర్బన్ పోలీసుస్టేషన్‌లో పుల్లప్పగారి హరి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రవీంద్రారెడ్డితో పాటు– అతడికి ఆశ్రయం కల్పించిన కమలాపురం మండలం నల్లింగాయపల్లెకు చెందిన గుర్రంపాటి సుబ్బారెడ్డి అలియాస్ సుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల మండలం సున్నపురాళ్లపల్లెకు చెందిన గురజాల ఉదయ్‌కుమార్‌రెడ్డిలు కూడా కారులో ఉండటాన్ని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే,ఈ అక్రమ కేసులపై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు ఈ ఏడాది మార్చి నెలలో వర్రా రవీంద్రారెడ్డికి పలు కేసుల్లో బెయిల్ మంజూరు చేసింది.

# రాయలసీమ గడ్డ...నా అడ్డా

## మా జోలికి వస్తూ ఊరుకునేది లేదు

## పుల అభివృద్ధి పనులు చేపట్టిన బాలకృష్ణ



**శ్రీ సత్యసాయి జిల్లా:** రాయలసీమ గడ్డ తన అడ్డా అని వైసీపీ నేతలకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గట్టి వార్నింగ్ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ వైసీపీ నేతలను బాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పర్యటిం చారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హిందూపురం మండలం ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు హిందూపురం అంటే రెండో పుట్టినిల్లుగా భావించేవారని నందమూరి బాలకృష్ణ అన్నారు. టీడీపీ అంటే ఒక జవాబుదారి పార్టీగా పేరుగాంచిందని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు ఒక విజనరీ ఉన్న లీడర్ అని కొనియాడారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే హిందూపురంలో రూ. 50 కోట్ల నిధులతో పనులు చేయించానని గుర్తుచేశారు. హిందూపురంలో శాశ్వత తాగునీటి పథకానికి రూ. 136 కోట్ల నివేదికలు సిద్ధం చేశామని అన్నారు. మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలిపారు. 1984లోనే ఎన్టీఆర్ తూముకుంట వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు- చేయడం.. హిందూపురం ప్రజలు మర్చి పోలేనిదని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రకమాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్న బాలకృష్ణ.. టేకులోడులోని ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.. ఇందిరమ్మ కాలనీలో గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్వాధీన పత్రాలను మంత్రి అనగానితో కలిసి పంపిణీ చేశారు.. మొత్తం 237 మంది లబ్దిదారులకు స్వాధీన పత్రాలు అందజేశారు.. ఇక, ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. టీ-డీపీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమ గడ్డ.. నా అడ్డా.. అని పేర్కొన్నారు..

# తమిళనాడు మత్స్యకారులకు రక్షణ ఇవ్వాలి

## ఇరు దేశాలు ఈ సమస్యపై పరస్పరం చర్చించాలి

## ఎక్స్‌లో పోస్ట్ చేసిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

అమరావతి: భారత మత్స్యకారుల విషయంలో శ్రీలంక ఉదారంగా ఉండాలని, సమస్యలు ఉంటే ఇరు దేశాలు కలిసి చర్చించాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇటీవల బంగాళాఖాతంలో జరిగిన ఐదు వేర్వేరు సంఘటనలలో తమిళనాడుకు చెందిన 24 మంది భారతీయ మత్స్యకారులకు సంబంధించిన సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. భారతదేశం, శ్రీలంక ప్రభుత్వాలు పరస్పర సహకార స్ఫూర్తితో ఈ సమస్యలను పరిష్కరించడానికి నిర్మాణాత్మక చర్చలు చేయడం అత్యవసరమని భావిస్తున్నట్లు- డిప్యూటీ- సీఎం అన్నారు. ఇరువైపులా మత్స్యకారుల భద్రత, గౌరవాన్ని నిలబెట్టడానికి నిరంతర ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నాగపట్నం జిల్లాకు చెందిన ఈ



మత్స్యకారులు సముద్రంలో జరిగిన ఘర్షణల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గాయపడ్డారని తెలుసుకోవడం బాధాకరం, భారతదేశం.. శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా, పునరావృతమయ్యే ఈ సంఘటనలను గమనించి, ఈ పునరావృత పరిస్థితులను స్నేహపూర్వకంగా పరిష్కరించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరుతున్నానని పోస్టు చేశారు. కాగా రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు. అప్పట్లో దివి సీమ తుఫాను వచ్చి అందరి ఆశలు తుడిచిపెట్టినట్లు-... గత ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టింది.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించండి

అమరావతి:రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి.. చేతికి వచ్చిన ఎన్నో పంటలు దెబ్బతినడంతో.. రైతులు గగ్గోలు పెడుతున్నారు.. ఈ క్రమంలో రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య నేతలతో భారీ వర్షాలపై మాజీ సీఎం వైఎస్ జగన్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేశారు.. అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రాష్ట్రంలో పలుచోట్ల ధాన్యం తడిసిపోవడంతో పాటు అనేక ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించాలని స్పష్టం చేశారు..

ఇక, రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వైసీపీ నేతలకు సూచించారు. కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలి. వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ

కల్లాల్లో పొలాల్లో రైతుల వద్దనున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించిందని విమర్శించారు.. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది . ఖరీఫ్‌లో ప్రతికూల వాతావరణం, కనీస మద్దతు ధరలు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రబీ సీజన్‌లో కూడా కష్టాలు పడుతున్నారని తెలిపారు.. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు

## తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి నాదెళ్ల

విజయవాడ: అకాల వర్షాలకు కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. సోమవారం ఆయన పెద్దాపురం మండలం జే తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వరి కోతలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అకాల వర్షాల వల్ల జరిగిన నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అకాల వర్షాల గురించి, కల్లాలలో తడిసిపోయిన ధాన్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ , కుడా చైర్మన్ తుమ్మల బాబు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం నాయక్, వ్యవసాయ శాఖ జే డి ఎన్ విజయ్ కుమార్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలావుంటే అకాల వర్షాలు ఏపీలోని పలు ప్రాంతాల్లో చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేశాయి.. ఈదురుగాలులతో మొదలైన వర్షం.. గంటన్నరపాటు బీభత్సం సృష్టించింది..ఆదివారం కురిసిన అకాల వర్షం.. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పంటలకు పట్టిన పూట పగిలినట్టయ్యింది. చేతికి వచ్చే పరిస్థితిలో ఉన్న పంటలు ఒక్కసారిగా వానకు గురై రైతుల కలలను కరిగింపజేశాయి. మొక్కజొన్న, మామిడి, వరి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. పంటలను ఎండబెట్టి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రైతుల ఆశలపై వర్షం నీళ్లు చల్లింది. కల్లంలో కాట వేసిన ధాన్యాన్ని అధికారులు ఇప్పటివరకు తీసుకోకపోవడంతో, ఆ ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఇప్పటికే నష్టపోయిన రైతులకు ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని మరోచోటికి తరలించే ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, కూలీల వ్యయాలు కూడా భారంగా మారాయి. ఇప్పటి వరకూ ఒక్క అధికారి కూడా వచ్చి మా పరిస్థితి చూడలేదు.. మా దయనీయం ఆయన పరిస్థితిని చూసి ప్రభుత్వం మమల్ని ఆదుకోవాలి అని రైతులు వేడుకుంటున్నారు..వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని స్థానిక నేతలు అంటున్నారు. కళ్లాల్లో, పొలాల్లో రైతులవద్దనున్న ధాన్యాన్ని


సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించడంలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు అకాల వర్షాలవల్ల మరింతగా నష్టపోతున్నారు. యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలి. రైతులకు బాసటగా నిలవాలి. రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

సిద్దిపేట:ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యులని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటుని విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామ ర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అందాల పోటీలపై పోటీపడి సమీక్షలు నిర్వహిస్తున్న నాయకులకు, కొనుగోలు కేంద్రాల్లోనే కుప్పకూలుతున్న రైతున్నల గుండె కోత వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.సాగునీళ్లు అందించడంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కొనుగోలుచేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ధాన్యం కొనలేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తూ రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. ధాన్యం కుప్పలపైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూరు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో జలపతిరెడ్డి అనే రైతు మృతి చెందాడని, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో హనుమండ్ల ప్రేమలత అనే మహిళా రైతు హఠాన్మరణం చెందిందని, ఏప్రిల్ 22న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి కొనుగోలు కేంద్రంలో బీర్రు వెంకన్న ప్రాణాలు కోల్పోయాడని, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నేర్పుతూ చింతకింది హనుమయ్య కుప్పకూలాడని తెలిపారు. ధాన్యపు రాశులే సాక్ష్యంగా, కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఈ మరణాలకు బాధ్యులు అని అన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, వారి ప్రాణాల మీదకు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీళ్లు అందించడంలో వైఫల్యం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేయడంలో వైఫల్యం, కాంటాలు పెట్టడంలో వైఫల్యం, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం, బడాయిగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యమని హరీశ్‌రావు అన్నారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు ప్రాణులు కోల్పోతుంటే ఏం ముఖం పెట్టుకొని వేడుకలు చేస్తున్నారని ప్రశ్నించారు.

ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని హరీశ్‌రావు అన్నారు. ఒక వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పినందుకు, ఇంకెందుకో తెలియదు గానీ ప్రకృతి పగ పట్టినట్టుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని.. పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రహసనంగా మారిందని అన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు 10 రోజులు దాటుతున్నా రైతులకు చెల్లించడం లేదని తెలిపారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయని అన్నారు. 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు 24.43 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. దీని విలువ రూ. 5664 కోట్లుత అని.. చెల్లించింది మాత్రం రూ. 3163 కోట్లు అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాహకుల అలసత్వం.. ఫలితంగా అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి వారాల కొద్దీ వేచి చూసినా కాంటాలు కావడం లేదని హరీశ్‌రావు తెలిపారు. టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో, అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని అన్నారు. వివిధ కారణాలు చెప్పి 5 కిలోల దాకా తరుగు తీస్తుండటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని చెప్పారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, తడిచిన ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం, పది రోజుల నుంచి కొనుగోలు ప్రక్రియ జరగడం లేదని విమర్శించారు. మార్కెట్లో వంద లారీలు ధాన్యం తడిసిపోయి ఉన్నాయని, వడ్ల కుప్పల మీదనే రైతులు ప్రాణాలు వదులుతున్నారని హరీష్ రావు అన్నారు. ఇప్పటికే ఐదుగురు రైతులు ధాన్యపు కుప్పల మీదనే ప్రాణాలు వదిలారన్నారు. ఇవి సాధారణ మరణాలు కావని, ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి రైతుల మీద లేదని విమర్శించారు. అందాల పోటీలు అన్నం పెడతాయా అని ప్రశ్నించారు. దేశంలో అత్యధిక పంట పండిందని గొప్పలు చెప్పడం కాదని.. రైతుల బాధలు పట్టించుకోవాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని కోరారు. పండిన పంటను కొనక రైతులను తిప్పలు పెడుతున్నారని.. అయితే ఢిల్లీకి.. లేకుంటే అందాల పోటీల రివ్యూలు... అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ.. రైతుల మీద లేకుండా పోయిందన్నారు. అకాల ఈదురు గాలులు, వర్షాలకు మామిడి కాయ లేకుండా మొత్తం రాలి పోయిందని అన్నారు. పత్తి రైతుల్ని కూడా ప్రభుత్వం ముంచిందని, పత్తి రైతులకు 20 శాతం మాత్రమే ఏంఎస్‌పికి తీసుకున్నారని.. మిగతా 80 శాతం బ్రోకర్లు, ప్రైవేటు మిల్లర్ల పాలు చేశారని విమర్శించారు. దాదాపు మూడు వేల కోట్ల నష్టం రైతులకు జరిగిందన్నారు.పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై సీబీఐ చేత విచారణ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 48 గంటల్లో వడ్ల పైసలు ఇస్తున్నామని చెబుతున్న మంత్రి నిరూపిస్తారా అని సవాల్ చేశారు. పది రోజులలోపు పైసలు రాడమే లేదన్నారు. బోనస్ అని గొప్పగా చెప్పి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా ఆగిపోయిందని.. తక్షణమే రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేవుడు, చర్చి, దర్గా మీద సీఎంకు నమ్మకం ఉంటే రుణ మాఫీ డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వానికి పరిపాలన సరిగా చేయడంలేదని, పాలన గాలిలో దీపంలా మారిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేల ఇన్పుట్ సబ్సిడీ అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇవ్వలేదు.. నాణ్యమైన కరెంటు ఇవ్వలేదు.. నీళ్లు ఇవ్వలేదు.. పండిన పంటను కూడా కొనడం లేదు అని విమర్శించారు. రుణమాఫీ జరిగిన రైతులు వివరాలతో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు- చేయాలని సూచించారు. 25 శాతం మందికి రుణమాఫీ చేసి పూర్తి రుణమాఫీ జరిగిందని ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని అన్నారు. మరికొన్ని చోట్ల దొంగల బెడద కూడా రైతన్నకు నిద్ర లేకుండా చేస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. ఇంటిని వదిలి, రోజుల తరబడి రైతులు వరి కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి అక్కడే కాపలా కాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు.

# తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా



**కుమ్రంభీమ్:** తెలంగాణలో రోడ్ల అభివృద్ధి బాధ్యత తనదని..అయితే నీటి సంరోణ ద్వారా భవిష్యత్ తరాలకు మనం నీటి నిల్వలు అందించాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బాధ్యతను స్వీకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రి గడ్కరీ కోరారు. విదర్భ ప్రాంతంలో నీటి నిల్వల ప్రాజెక్టులు చేపట్టి విజయం సాధించామని అన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే 4 అంశాలు దేశాభివృద్ధిని నిర్దేశిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సభావేదికపై నుంచి జాతీయ రహదారులను ఆయన ప్రారంభించారు. రూ.3,900 కోట్ల విలువైన పనులను మొదలుపెట్టి మాట్లాడారు.ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు- చేసిన బహిరంగ సభా వేదిక పైనుంచే 7 జాతీయరహదారులు ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని, భూమికోసం, భుక్తి కోసం.. జిల్లా ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని, ఆదిలాబాద్ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిందని, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలని, తనకు 13 డాక్టరేట్లు ఉన్నాయని.. తాను ఇంజనీరును కానని, అయినా 13 డాక్టరేట్లు ఉన్నాయని నితిన్ గడ్కరీ చెప్పారు. ఇక్కడి ప్రజల సమస్యలు అర్థం చేసుకునే రోజు వచ్చిందని అన్నారు. పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని, రోడ్లు బాగున్న దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని అన్నారు. భద్రాద్రి, బాసర, మేడారం ఆధ్యాత్మిక క్షేత్రాలు హైవేతో అనుసంధానం చేస్తామని చెప్పారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తామన్నారు. నాగపూర్ నుంచి విజయవాడ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టినట్లు- తెలిపారు. జగిత్యాల- కరీంనగర్ హైవే విస్తరణ వేగవంతం చేస్తామని, వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులే దేశాభివృద్ధి అని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని చెప్పారు. రహదారులు మెరుగ్గా ఉండే దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ సందర్భంగా అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆవాసీల జిల్లా ఇది అని కొనియాడారు. రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది. రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగ మార్గాలు నిర్మిస్తున్నాం. జోజిలా పాస్ టన్నెల్ వంటి నిర్మాణాలను చేపట్టాం. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నాం. నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్ చేపట్టాం. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుంది. భద్రాచలం, బాసర, మేడారం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను త్వరలోనే చేపడతాం. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాం. అంబర్‌పేట్‌లో నిర్మించిన పైవంతెనను ఇవాళే ప్రారంభించు కోనున్నాం. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. పెట్రోల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు ఇంకా పెరగాలి. వీటితో రవాణా ఖర్చు బాగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు. స్మార్ట్ సీటీలు కాదు...స్మార్ట్ విలేజ్‌లను తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో రెండులక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ కోసం రాబోయే రోజుల్లో లక్ష కోట్లు- ఖర్చు చేస్తామని చెప్పారు. గడ్చిరోలీ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. రైతులు ఆత్మహత్యచేసుకున్న విదర్భలో తాము పనిచేశామని చెప్పారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలన్నారు. వెనుకబడిన జిల్లాలో అభివృద్ధి కోసం మేం పనిచేస్తున్నాం. అమృత్ సరోవర్ పేరుతో నీటి నిల్వలు పెంచుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే మేం నీటి నిల్వలు పెంచేందుకు సిద్ధం.

తెలంగాణలో కూడా అలా నీటి సరస్సులను గుర్తిస్తే మేం అభివృద్ధి చేస్తాం అని గడ్కరీ హామీ ఇచ్చారు. మీ సమస్యలను అర్థం చేసుకునే అవకాశం వచ్చింది. రోడ్డు బాగుంటేనే అమెరికా ధనిక దేశం అయింది. తెలంగాణలో కూడా రోడ్లు బాగుంటేనే ధనిక రాష్ట్రం అవుతుందన్నారు. నీరు, ఇంధనం, రవాణా, కమ్యూనికేషన్, ఏఐతో ఏ ప్రదేశమైనా అభివృద్ధి జరుగుతోంది. .శ్రీనగర్, జమ్మూలో36 టన్నెల్స్ నిర్మిస్తున్నాం. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం, ఆర్ఎస్ఎస్ లో ఉన్నప్పుడు ఆదివాసీలతో కలిసి పనిచేశాం. యువకులకు ఉద్యోగాలు, రైతులకు మద్దతు ధర దక్కాలి. జగిత్యాల వరంగల్ హైవేకు రూ.1000 కోట్లు- కేటాయించాం అని నితిన్ గడ్కరీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, బండి సంజయ్, కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపీ గోడం నగేశ్, వంశీ, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, పాల్వాయి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## రూపాయి అప్పకూడా పుట్టని పరిస్థితి

హైదరాబాద్:ఖజానా అంతంతమాత్రంగానే ఉన్నా..ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా.. సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాం లో సమయానికి జీతాలు రాకున్న నోరు విప్పలేదు.. ఇప్పుడు వాళ్ల అడగకముందే జీతాలు ఇస్తోన్న సమరం చేస్తామంటున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని సూచించారు. రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిన స్థితిలో ఉందని.. ఒక్కరూపాయి కూడా అప్పు పుట్టడం లేదని.. బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు- చూస్తున్నారని అన్నారు. అణాపైసా చిక్కడం లేదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి నెలకొందని.. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని తెలిపారు.

సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టు-బడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటు-ంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు-,

అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

## పెరుగుతున్న ఎండలతో జనం బెంబేలు



హైదరాబాద్: తెలంగాణలో ఎండల తీవ్రత పెరుగుతోంది. అప్పుడప్పుడు వానలు పడినా ఎండలు మాత్రం తగ్గేదేలే అన్నట్లు దంచికొడుతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా విజృంభిచనున్నట్లు- వాతావరణ శాఖ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా.. మే 15 తర్వాత ఎండల తీవ్రత మరింత పెరగనుందని తెలిపింది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలకు తోడుగా 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

కూడా వీచే అవకాశం ఉందని పేర్కొంది. 12 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని తెలిపింది. ఇక, ఈశాన్య తెలంగాణలో మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## రసాయన ఎరువుల వాడకం తగ్గాలి

వికారాబాద్: వ్యవసాయంలో మరిన్ని మార్పులు రావాలని,రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికా ఉత్పత్తి పేరుతో భూసారం దెబ్బతీస్తున్నారని అన్నారు. దీనిపై రైతులు ఆలోచన చేయాలని అన్నారు. భూసారం దెబ్బతింటే ఏ మందూ పనిచేయదని అన్నారు. రైతు వేదికలో..'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని మంత్రితుమ్మల సోమవారం తుమ్మల ప్రారంభించారు. సభాపతి ప్రసాద్ కుమార్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డిలతో పాటు- ధరూర్ క్లస్టర్ పరిధిలోని రైతులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ సన్నద్ధంలో భాగంగా శాస్త్రవేత్తలు రైతులను సమాయత్తం చేశారు. వరి సాగులోనూ పాక్షికంగా ఆరుతడి విధానం పాటించాలని తుమ్మల అన్నారు. యూరియా అధికంగా వాడి, మనల్ని పోషించే భూతల్లిని నాశనం చేయొద్దని సూచించారు. గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం పంటల బీమాను మళ్ళీ పునరుద్ధరించనుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దీని సాగు పెరగాలి. ఇప్పుడు అన్ని జిల్లాల్లో ఈ పంట సాగుకు అనుమతి ఉంది. ఆయిల్‌పామ్‌లో మూడేళ్ల పాటు- అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. గతంలో ఈ పంట దిగుబడి ఆరేళ్లకు వచ్చేది.. ఇప్పుడు మూడేళ్లకే వస్తోంది. దీని సాగుతో నెలకు రెండుసార్లు జీతం వచ్చినట్లు- రైతులకు ఆదాయం వస్తుంది. గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం పంటల బీమాను మళ్లీ పునరుద్ధరించనుంది. ఖజానా ఖాళీగా ఉండటం వల్ల కొన్ని ఆలస్యం అవుతున్నాయని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## అంబర్‌పేట, బిహెచ్ఇఎల్ ఫ్లై
# ఓవర్లకు మోక్షం

హైదరాబాద్: హైదరాబాద్‌లో అంబర్‌పేట ఫ్లై ఓవరు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట, బీహెచ్ఈఎల్ కూడలిలో నిర్మించిన పైవంతెనలను కేంద్ర మంత్రి

నితిన్ గడ్కరీ ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం కోసం పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అందరికీ నమస్కారం, బాగున్నారా..? అంటూ తెలుగులో మాట్లాడడం మొదలు పెట్టిన ఆయన అనేక అభివృద్ధి అంశాలపై స్పందించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు సరిగా సాగడంలేదని గడ్కరీ పేర్కొన్నారు. ఈ పనుల్లో తలెత్తిన సమస్యకు పరిష్కారం కనుగొన్నామని, వేగంగా పూర్తి చేయడంకోసం కొత్త కాంట్రాక్టర్‌ను నియమించామని తెలిపారు. వచ్చే పది నెలల్లో ఫ్లై ఓవర్‌ను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ భూసేకరణ వేగంగా పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఐటీ-, ఫార్మా రంగాల్లో అగ్రస్థానంలో ఉందని.. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఇది కేంద్ర బిందువైందని గడ్కరీ అభిప్రాయపడ్డారు. దేశంలోని అనేక నగరాల నుంచి ప్రజలు హైదరాబాద్‌ను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రధాన నగరాలతో కలిపేలా జాతీయ రహదారుల అభివృద్ధి జరిగిందని వివరించారు. ఇండోర్-హైదరాబాద్ కారిడార్ తెలంగాణలో పూర్తయ్యిందని, మహారాష్ట్రలో కూడా పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కారిడార్‌తో 20 గంటల ప్రయాణం 10 గంటల్లో పూర్తి అవుతుందని చెప్పారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్-విజయవాడ 4 లేన్ రోడ్డు ని 6 లేన్ రోడ్డుగా మారుస్తామని చెప్పారు. నాగ్‌పూర్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన డబుల్ డెక్కర్ ఎయిర్ బస్ ను హైదరాబాద్ రింగ్ రోడ్డుపై ప్రయోగాత్మకంగా పరిశీలన చేయాలని రాష్ట్ర మంత్రులను కోరారు. ఈ బస్సులో ఎయిర్ హోస్టెస్ లాగా బస్ హోస్టెస్ కూడా ఉంటారని, సాధారణ బస్సుల కంటే 3 శాతం ఛార్జి తక్కువగా ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రిక్ర్ వాహనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని.. డీజిల్, పెట్రోల్ వాహనాలపై ఆధారం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులు వ్యవసాయంలో కూడా పర్యావరణహిత వాహనాలు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క స్మార్ట్ నగరాలతో దేశ అభివృద్ధి సాధ్యం కాదని, స్మార్ట్ గ్రామాలు అవసరం అని గడ్కరీ తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

హైదరాబాద్‌లో ఐటీతోపాటు ఫార్మా రంగం కూడా పెద్దదే. దేశంలోని ఎన్నో నగరాల నుంచి హైదరాబాద్‌కు వస్తుంటారు. అన్ని ప్రధాన నగరాలను హైదరాబాద్‌కు కనెక్ట్ చేసేలా జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం. తెలంగాణ అభివృద్ధికి మోదీ నేతృత్వంలో మేమంతా కట్టు-బడి ఉన్నాం. ఇండోర్-హైదరాబాద్ కారిడార్ తెలంగాణ పనులు పూర్తి చేశాం. మహారాష్ట్రలో కూడా పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. ఈ కారిడార్ పూర్తయితే 20 గంటల ప్రయాణం 10 గంటల్లోనే చేయొచ్చు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ - విజయవాడ 4 లైన్ల రోడ్డును 6 లైన్లుగా మారుస్తాం. అంబర్‌పేట పైవంతెనను రూ.145 కోట్లతో, నాలుగు వరుసల్లో సుమారు 1.5 కి.మీ మేర నిర్మించగా.. చందానగర్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా రామచంద్రాపురం వరకు రూ.176 కోట్లతో 1.6కి.మీ మేర బీహెచ్ఈఎల్ వంతెనను నిర్మించారు. నితిన్ గడ్కరీ కృషి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయన్నారు. అమెరికాను తలదన్నేలా భారత్‌లో జాతీయ రహదారులు ఉన్నాయి. నితిన్ గడ్కరీ దగ్గరకు ఏ పార్టీ ఎంపీ వెళ్లి అడిగినా కాదనకుండా ఇస్తారు. ఆయన్ను ఫ్లై ఓవర్ల మంత్రి అని కూడా పిలుస్తుంటారు.

అంబర్‌పేట ÷-లఫైఓవర్ ప్రారంభించుకున్నప్పటికీ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆయా ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి‘ అని అన్నారు. నో అనే మాట గడ్కరీ నోటి నుంచి రాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉప్పల్, కొంపల్లి కారిడార్‌లు వేగవంతం చేయాలని కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, కరీంనగర్ హైవేను జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు. ఇదిలావుంటే అంబర్‌పేట పైవంతెన ప్రారంభోత్సవ సమయంలో ఉద్రిక్తత చోటు- చేసుకుంది. కాంగ్రెస్, భాజపా శ్రేణుల మధ్య తోపులాట చోటు- చేసుకుంది. భాజపా నాయకులు మోదీ..మోదీ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పోటీగా నినాదాలు అందుకున్నారు.

ఉత్తేజిత దినపత్రిక


# ఇలా చేస్తే తగ్గుతుంది..!





కొన్నిసార్లు.. ఏదో బరువు మోసినట్లు, మెడపై ఒత్తినట్లు.. మెడ నుంచి భుజాల వరకూ నొప్పి వస్తూ ఉంటుంది. ఇలా ఉంటే.. ఏ పని చేసుకోలేరు, చిన్న బరువు ఎత్తినా ఇబ్బందిగా ఉంటుంది. అదే పనిగా కంప్యూటర్ ముందు కూర్చొన్నా, వంటగదిలో గంటల కొద్దీ నిలబడి పనిచేసినా ఈ నొప్పి వస్తుంటుంది. ఈ నొప్పి నుంచి ఎలా ఉపశమనం పొందాలో ఈ స్టోరీలో చూద్దాం.

కుర్చీలో నిటారుగా కూర్చోవాలి. చేతులను అలాగే ఉంచి, భుజాలతో చెవులను తాకుతున్నట్లుగా చేయాలి. అలా 10-20 సార్లు చేయండి. ఆ తర్వాత నిటారుగా కూర్చొని మెడ వంచి తల భుజానికి ఆనేలా కొన్ని సెకన్లపాటు ఉంచాలి. ఇరువైపులా కొద్దిసేపు ఇలా చేస్తే నొప్పి నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది.

నొప్పి ఎక్కువగా ఇబ్బంది పెడుతుంటే.. పని పక్కన పెట్టి, కొంచెం సేపు పడుకొని విశ్రాంతి తీసుకోండి. ఇంకా తగ్గకపోతే.. ఏదైనా క్లాత్‌లో ఐస్ క్యూబ్స్ వేసుకుని నొప్పి ఉన్న ప్రాంతంలో అద్ది ఉంచండి. 10-20 నిమిషాలు ఉంచితే నొప్పి దూరమవుతుంది. రోజులో కనీసం 3-4 సార్లు ఇలా చేస్తే నొప్పి కొంత తగ్గుతుంది.

చేతులను ముందుకు చాచి, ఒక్కో చేతిని సవ్య, అపసవ్య దిశల్లో సర్కిల్‌లో తిప్పాలి. ఇలా 5-10 నిమిషాలు చేసినా ఉపశమనం దొరుకుతుంది. %ంష్ట్రశీబశ్రీఠవతీ జూఖఱఅ మెడ నుంచి భుజం వరకు నొప్పి ఇబ్బంది పెడుతుంటే.. చేతులను పక్కకీ, ముందుకీ చాచండి.. ఆ తర్వాత కిందకి దించండి. కుర్చీలో మెడను వెనక్కి వాల్చినట్లు కూర్చున్నా మంచిదే.


శరీరం అలసి పోయినా.. ఏదో పొడుస్తున్నట్లుగా ఈ నొప్పి వస్తుందని నిపుణులు అంటున్నారు. అదే పనిగా కూర్చొని లేదా నిల్చొని ఉంటున్నామని అనిపిస్తే మధ్య మధ్యలో నడవడం, కాసేపు చేతులు, మెడ స్ట్రెచింగ్ వంటివి చేస్తే ఈ సమస్య ఉండదు. గోరువెచ్చని నీటిలో కాస్త కళ్లుప్పు వేసుకొని స్నానం చేసినా వాపు కారణంగా వచ్చే నొప్పు తగ్గుతుంది. లేదూ వేడినీటి కాపడమైనా సరిపోతుం ది. అయితే నేరుగా చర్మంపై పెట్టకండి. ఏంత చేసిన నొప్పి తగ్గకపోతే.. డాక్టర్‌ను సంప్రదిం చడం మేలు.

# చలికాలంలో వెల్లుల్లి తింటే..



చలికాలంలో డైట్‌లో చేంజెస్ చేయడం చాలా ముఖ్యం. కొన్ని ఫుడ్స్ తీసుకుంటే ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు. అందులో భాగంగా వెల్లుల్లి తినడం ఎందుకు ముఖ్యమో తెలుసుకుందాం.

చలికాలంలో వెల్లుల్లి తింటే చాల సమస్యలు దూరమవుతాయి. వెల్లుల్లిలో జలుబు, ఫ్లూ వంటి సమస్యలని దూరం చేసే ఎన్నో లక్షణాలు ఉన్నాయి. వెల్లుల్లిలో ఉండే కొన్ని పోషకాలు ఇమ్యూనిటీని బలంగా చేస్తాయి. దీంతో చాలా ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి.



వెల్లుల్లిలోని పోషకాలు.. వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు సాయపడతాయి. అల్లిసిన్ అనే సమ్మేళనం కూడా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్స్ నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. దీంతో ఫ్రీ రాడికల్స్ నుండి శరీర కణాలను దెబ్బతినకుండా కాపాడి ఇమ్యూనిటీని పెంచుతాయి.

జలుబు, ఫ్లూ.. చలికాలంలో జలుబు, దగ్గు వంటి సమస్యలతో చిన్నపిల్లలే కాకుండా పెద్దలు కూడా బాధపడుతుంటారు. అలాంటి వారు రెగ్యులర్‌గా వెల్లుల్లిని తినాలి. వెల్లుల్లిని పచ్చళ్ళ, కూరల్లో కలపి తింటే ఇమ్యూనిటీ పెరిగి జలుబు దూరమవుతుంది.

శరీర ఉష్ణోగ్రత పెరగడం.. వెల్లుల్లిలో వేడి పుట్టించే గుణాలు ఉన్నాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతని పెంచి చలిని తగ్గిస్తుంది. వెల్లులి తీసుకుంటే రక్త ప్రసరణ పెరుగుతుంది. ఇది చేతులు, కాళ్ళకి వెచ్చదనాన్ని అందించి జలుబు నుండి ఉపశమనం అందుతుంది.

గుండె ఆరోగ్యం.. చలికాలంలో వెల్లుల్లి రసం తీసుకుంటే వ్యాధులని తగ్గించి గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తపోటుని తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. చలికాలంలో గుండెపోటు, ఇతర సమస్యలు దూరమవుతాయి.

ఇమ్యూనిటీ.. వెల్లుల్లిలోని అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, ఇమ్యునోమోద్యులేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవన్నీ కూడా ఇమ్యూనిటీని పెరుగుతుంది. కాబట్టి, చలికాలంలో వెల్లుల్లి తినడం మంచిది. జీర్ణరసాలు, ఎంజైమ్స్ ఉత్పత్తిని ప్రేరేపించ దంలో సాయపడుతుంది. ఆహారాన్ని జీర్ణం చేయడం, పోషకాలను గ్రహించడాన్ని సులభతరం చేస్తుంది. దీంతో ఆహారం నుండి అవసరమైన పోషకాలు శరీరానికి అందుతాయి.

# ముఖం మెరుస్తుందట..



ముఖం అందంగా కనిపించాలని చాలా మంది రోజ్‌వాటర్ రాస్తుంటారు. కానీ, అందులో బంగాళాదుంప రసం కలిపి ముఖానికి రాస్తే మరింత కాంతివంతంగా మారుతుంది. పూర్తి వివరాలు తెలుసుకోండి. ఈ రెండింటిని కలిపి రాస్తే మొటిమలు, మచ్చలు తగ్గి ముఖం మెరుస్తుందట.. సాధారణంగా ముఖంపై మచ్చలు పోగొట్టి అట్రాక్టివ్‌గా కనిపించాలంటే బంగాళాదుంప రసం హెల్ప్ చేస్తుంది. దీని వల్ల చర్మానికి మేలు జరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్, విటమిన్స్ చర్మాన్ని చక్కగా కనిపించేలా చేస్తాయి.

బంగాళాదుంప, రోజ్‌వాటర్.. బంగాళాదుంప రసం, రోజ్ వాటర్ కలిపి ముఖానికి అప్లై చేస్తే చర్మానికి మేలు జరుగుతుంది. అవేంటి? ఈ రెండింటిని కలిపి ఎలా అప్లై చేయాలి. వీటి వల్ల కలిగే లాభాలు ఏంటో పూర్తిగా తెలుసుకోండి.

మొటిమలు.. ఈ రెండింటిని కలిపి రాస్తే ముఖంపై మొటిమల సమస్య కూడా తగ్గుతుంది. రెండింటిని బాగా కలిపి ముఖానికి అప్లై చేసి తర్వాత సాధారణ నీటితో కడగాలి. ఇలా చేస్తే మొటిమల సమస్య తగ్గుతుంది.





పిగ్మంటేషన్.. మీ చర్మం నల్లగా ఉంటే బంగాళాదుంప రసం, రోజ్ వాటర్ రెండూ కూడా డార్క్ స్కిన్‌ని దూరం చేస్తుంది. చర్మం నల్లబడడం, పిగ్మంటేషన్ రెండింటిని దూరం చేస్తాయి. ఇందుకోసం రెండింటిని కలిపి చర్మానికి అప్లై చేసి 10 నుండి 15 నిమిషాల పాటు అలానే ఉంచి చర్మాన్ని క్లీన్ చేయండి. ఇక చర్మంపై ఏర్పడిన మచ్చల్ని తగ్గించడంలోనూ రోజ్ వాటర్, బంగాళాదుంప జ్యూస్ హెల్ప్ చేస్తుంది. ఈ రెండింటిని ఓ గిన్నెలో కలిపి అందులోనే పసుపు రాయండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి 20 నిమిషాల తర్వాత ముఖాన్ని క్లీన్ చేస్తే మచ్చలు తగ్గి ముఖం కాంతివంతంగా మారతుంది.



# ఈ జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలి



మేకప్ అంటే అమ్మాయిలకు ఎంతిష్టమో స్పెషల్‌గా చెప్పనవరం లేదు. పార్టీలు, ఫంక్షన్స్ ఉన్నప్పుడైతే మేకప్ తప్పని సరి. ఇష్టంతోనే కాదు.. కొందరు వృత్తిలో భాగంగానూ రోజూ మేకప్ వేసుకోవలసి ఉంటుంది. రోజూ మేకప్ వేసుకుంటే.. అది చర్మంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మేకప్ ఉత్పత్తుల్లో కెమికల్స్ కారణంగా చర్మం దెబ్బతింటుంది. మేకప్ కారణంగా చర్మం పొడిబారడం, మొటిమలు, వృద్ధాప్య ఛాయలు త్వరగా రావడం వంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ప్రీ, పోస్ట్ మేకప్ తీసుకుంటే.. మేకప్ నుంచి చర్మాన్ని రక్షించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. చర్మాన్ని మేకప్ నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

సరైన బేస్ ఎంచుకోండి..

మీ రు మేకప్ వేసుకునేముందు, చర్మానికి సరైన బేస్ అప్లై చేయడం చాలా ముఖ్యం. పగటిపూట.. ఫౌండేషన్, క్రీమ్‌ను ధరించే ముందు ప్రైమర్ లాంటి ముగింపుని ఇచ్చే మాయిశ్చరైజర్‌లు, సన్‌స్క్రీన్‌లు అప్లై చేసుకోవడం చాలా ముఖ్యం. సాయంత్రం పూట మేకప్ వేసుకుంటుంటే.. నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌లను ఉపయోగించి చర్మాన్ని హైడ్రేట్ చేయడం ముఖ్యం, దాని తర్వాత.. మేకప్ ఎక్కుసేపు ఉండటానికి.. జెల్ ఆధారిత ప్రైమర్‌ను అప్లై చేయండి.



మేకప్ ఉత్పత్తులకు రంగు, సువాసన ఇవ్వడానికి వాటిలో విషపూరితమైన కెమికల్స్ వాడే అవకాశం ఉంది. ఈ కెమికల్స్ మీ చర్మానికి హాని చేస్తాయి. మీ మేకప్ ఉత్పత్తులలో హానికరమైన కెమికల్స్ లేకుండా జాగ్రత్తపడండి. పారాబెన్స్, ఫార్మాల్డిహైడ్, పాదరసం, థాలేట్స్, సీసం, సమ్మేళనాలు ఎండోక్రైన్ వ్యవస్థలు, సంతానోత్పత్తికి అంతరాయం కలిగిస్తాయి. ఈ కెమికల్స్ కారణంగా.. క్యాన్సర్ ముప్పు కూడా పెరుగుతుంది. మీరు సాధ్యమైనంత వరకు సహజ ఉత్పత్తులు వాడటానికి ప్రయత్నించండి. మీ చర్మానికి మాత్రమే కాకుండా మీ ఆరోగ్యానికి కూడా సురక్షితమైన మేకప్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం.



మేకప్ బ్రష్‌లను శుభ్రం చేయండి.. మేకప్ అప్లై చేయడానికి ఉపయోగించే బ్రష్‌లు, స్పాంజ్‌లు, అప్లికేటర్‌లను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. మీ మేకప్ బ్రష్‌లను యాంటిసెప్టిక్ లిక్విడ్ సబ్బుతో డీప్ క్లీన్ చేయాలి. బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్ ఉపయోగించి స్పాంజ్‌లను శుభ్రం చేసుకోవాలి. స్పాంజ్‌లను బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్‌తో శుభ్రం చేసుకోవచ్చు. ఇవి స్పాంజ్‌ల నుంచి కన్సీలర్, ఫౌండేషన్ మరకలను తొలగిస్తుంది. ప్రతిరోజూ మేకప్ వేసుకునే వారు.. వారానికి రెండుసార్లు మేకప్ బ్లష్‌లను శుభ్రం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్రష్‌లు, స్పాంజ్‌లను ఆరబెట్టడానికి హెయిర్‌డ్రైర్‌ను ఉపయోగించవచ్చు.

మేకప్ శుభ్రంగా రిమూవ్ చేయండి.. మేకప్‌ను సరిగ్గా రిమూవ్ చేయకపోతే.. చర్మ సమస్యలు ఎదురవుతాయి. మేకప్ తొలగించుకునే క్రమంలో రిమూవర్ ఉపయోగించినా.. గట్టిగా రుద్దుతూ మరీ శుభ్రం చేసుకుంటారు కొంతమంది. అయితే ఇలా చేయడం వల్ల చర్మం డ్యామేజ్ అయ్యే ప్రమాదమే ఎక్కువ అంటున్నారు నిపుణులు. అందుకే నెమ్మదిగా తొలగించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చర్మానికి జిడ్డుగా అతుక్కుపోయిన మేకప్‌ను ముందుగా కరిగించాల్సి ఉంటుంది. ఇందుకోసం మేకప్‌ను తొలగించే క్లెన్సర్లు బయట దొరుకుతాయి. కాస్త ఎక్కువగా మేకప్ వేసిన భాగంలో ఈ కాటన్‌ని కొన్ని సెకన్ల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల మేకప్ కరిగిపో తుంది. అప్పుడు తొలగించడం సులభమవు తుంది. ఆ తర్వాత. . ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను చేతు ల్లోకి తీసుకొని ముఖా నికి, మెడకు బాగా పట్టించి 2-3 నిమిషాల తర్వాత కాటన్ ప్యాడ్లతో తుడిచేసుకుంటే సరి. లిప్‌స్టిక్‌ను సైతం కొబ్బరినూనెతో ఇలాగే తొలగించుకోవచ్చు. కొన్ని రకాల మేకప్ రిమూవర్స్ చర్మంలోని సహజ సిద్ధమైన నూనెల్ని తొలగిస్తాయి. ఇలాంట ప్పుడు మేకప్ తొలగించుకొని, ముఖం శు భ్రం చేసు కున్న తర్వాత చర్మానికి మాయిశ్చరైజర్ అప్లై చేయడం తప్పనిసరి. ఇక పెదాలకు లిప్‌బామ్, కళ్లకు ఐ క్రీమ్.. వంటివీ ఆయా భాగాల్ని తేమగా ఉంచేందుకు తోడ్పడతాయి.

# ఈ స్నాక్స్ తింటే.. బరువు కంట్రోల్‌లో ఉంటుంది..!

శీతాకాలంలో కొంతమంది బరువు పెరుగుతుంటారు. వాతావరణం చల్లగా ఉండటం, చలి వంటి కారణాల వల్ల.. వ్యాయమం చేయడానికి చాలామంది బద్ధకిస్తూ ఉంటారు. అంతేకాదు, ఈ సీజన్‌లో జీవక్రియ పనితీరు నెమ్మదిస్తుంది. దీంతో శరీరంలో పేరుకున్న ఫ్యాట్ కరగడానికి చాలా కష్టం అవుతుంది. దీంతో చాలామంది బరువు పెరుగుతారు. బరువును కంట్రోల్‌లో ఉంచుకోవడానికి మన డైట్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సీజన్ కొన్ని హెల్తీ స్నాక్స్ మన డైట్‌లో చేర్చుకుంటే.. బరువును కంట్లోల్‌లో ఉంచడానికి సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. వీటిలో కేలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి మీ ఆకలని కంట్రోల్‌లో ఉంచుతాయి, కేలరీ ఇన్‌టేక్ తగ్గిస్తాయి. తద్వారా బరువు కంట్రోల్‌లో ఉంటుంది. అంతకాదా, బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచడానికి, రోజంతా మిమ్మల్ని యాక్టివ్‌గా ఉంచడానికీ తోడ్పడతాయి.?

వేయించిన శనగలు.. మీ బరువును కంట్రోల్‌లో ఉంచుకోవడానికి, బరువు తగ్గించుకోవడానికి.. వేయించిన శనగలు బెస్ట్ స్నాకింగ్ ఆప్షన్. సెనగల్లోని ప్రొటీన్, ఫైబర్ కలిసి నెమ్మదిగా జీర్ణం కావడంతోపాటు ఆకలికి సంబంధించిన హార్మోన్ శాతాన్ని తగ్గిస్తాయి. ఫలితంగా క్యాలరీల శాతం తగ్గడంతో సెనగల్ని తినేవాళ్లలో బరువుతోపాటు నడుం చుట్టుకొలత కూడా తగ్గిందని నిపుణులు అంటున్నారు. సెనగల్లోని ఫైబర్ మలబద్ధకం సమస్యను దూరం చేస్తుంది. ఫైబర్ పొట్టలోని బ్యాక్టీరియాను ఆరోగ్యంగానూ ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌నీ తగ్గిస్తుంది.

బ్రెర్లీలు, యోగర్ట్.. యోగర్ట్‌లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది.. ఇది కణజాలాలను నిర్మించడానికి, మరమ్మత్తు చేయడానికి సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్ రిచ్ బెర్రీలను పెరుగులో యాడ్ చేసుకుని తింటే.. శరీరానికి అవసమైన విటమిన్లు, మినరల్స్ అందిస్తుంది. గట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

డార్క్ చాక్లెట్.. డార్క్ చాక్లెట్‌లో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. రా కోకో పౌడర్, 80-90 శాతం డార్క్ చాక్లెట్ ఉన్నవే ఎంచుకోండి. ఇది చెడు కొవ్వును తగ్గించడమే కాదు రోగనిరోధక శక్తినీ పెంచుతుంది. రోజుకి 1 లేదా 2 క్యూబ్స్ తీసుకుంటే చాలు.






ఆల్మండ్ బటర్, యాపిల్ ముక్కలు.. యాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఫైబర్ మీ కడుపును నిండుగా ఉంచుతుంది, తద్వారా మీ అతిగా తినకుండా కంట్రోల్‌లో ఉంచుతుంది. ఇది మీరు బరువు పెరగకుండా సహాయపడుతుంది. ఆల్మెండ్ బటర్‌లోని ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి.



వేయించిన నట్స్.. బాదం, వాల్‌నట్స్, జీడిపప్పులు, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్‌లో పోషకాలు అధికంగా ఉంటాయి. రోజూ గుప్పెడు వేయించిన డ్రై ఫ్రూట్స్ తింటే.. మీ కడుపు నిండుగా ఉంటుంది. ఈ గింజల్లోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు మీ బరువును కంట్రోల్‌లో ఉంచడానికి సహాయపడతాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గించి.. మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.



ఉడకబెట్టిన చిలగడదుంపలు.. చిలగడ దుంపల్లో బీటా-కెరొటిన్, విటమిన్-ఈ, సి, బి-6, పొటాషియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. వీటిల్లో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది. ఈ దుంపల్లో మనకి అవసరమైన ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది శరీర కణాల సామర్థ్యాన్ని పెంచి అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరాని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా రోగ నిరోధక వ్యవస్థకు కీలకమైన తెల్లరక్తకణాల ఉత్పత్తికి సాయపడతాయి. వీటిలో ఉండే కెరొటెనాయిడ్స్ యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తూ రక్తంలో చక్కెర స్థాయిని, ఇన్సులిన్‌ను నియంత్రిస్తాయి. తద్వారా తిన్న పదార్థాలు కొవ్వుగా మారకుండా చేస్తాయి. ఇవి స్నాక్ రూపంలో తీసుకుంటే.. మీ బరువు కంట్రోల్‌లో ఉంటుంది.

# జాబ్ ఇంటర్వ్యూకు వెళ్లే ముందు.. ఈ 5 ఫుడ్స్ అసలు తినొద్దు..!

మీ డ్రీమ్ జాబ్ ఇంటర్వ్యూ కోసం మీరు చాలా బాగ రెడీ అయ్యారు. ఆ జాబ్ మీకే వస్తుంది అనే నమ్మకంతో ఉన్నారు. ఇంటర్వ్యూ చేసే వారి ఎదుట చాలా కాన్ఫిడెంట్‌గా కూర్చున్నారు. అంతా మీరు అనుకున్నట్లే జరుగుతుంది, ప్రతీది కరెక్ట్‌గా ఉంది అనుకునే సమయంలో.. మీ పొట్టలో గడబిడగా ఉన్నట్లు, కడుపులో నుంచి శబ్దాలు, నోటి నుంచి బ్రేవ్ మనే సౌండ్స్ వస్తే.. ఇంటర్వ్యూ చేసే వ్యక్తి మిమ్మల్ని వింతగా, ఆశ్చర్యంగా చూస్తూ ఉంటారు. ఈ పరిస్థితి మీకు ఎబ్బెట్టుగా అనిపించవచ్చు. మీరు ఇంటర్వ్యూకు వచ్చే ముందు తిన్న ఆహారం వల్ల ఈ వింత పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది.



ఇబ్బందికర పరిస్థితులను నివారించడానికి ఇంటర్వ్యూకు వెళ్లే ముందు పూర్తిగా నివారించాల్సిన కొన్ని ఆహారాలు ఉన్నాయి.



ఉల్లిపాయలు, వెల్లుల్లి.. ఉల్లిపాయలు, వెల్లుల్లి దాదాపు అన్ని వంటల్లో ఉంటాయి. అయితే, జాబ్ ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు.. ఉల్లిపాయ, వెల్లుల్లి ఉన్న వంటకాలను తినకుండా ఉండటం మంచిది. ఈ రెండు ఆహారాలకు ఘాటైన వాసన ఉంటుంది, ఇవి నోటిద దర్వాసనకు కారణం అవుతాయి. మీ నోటి నుంచి దుర్వాసన వస్తే.. మిమ్మల్ని ఇంటర్వ్యూ చేసే వ్యక్తికి మీపై చెడు అభిప్రాయం కలుగిస్తుంది, మీరు శుభ్రంగా ఉండరనే అభిప్రాయం వారికి కలుగుతుంది. ఉల్లిపాయ, వెల్లుల్లి కడుపు ఉబ్బరం, కడుపులో అసౌకర్యం వంటి సమస్యలను కూడా కలిగిస్తాయి. ఒకవేళ మీరు ఇంటర్వ్యూకు ముందు వాటిని తిన్నా.. కచ్చితంగా బ్రష్ చేసుకోండి.



వేయించిన ఆహారం.. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు వేయించిన ఆహారాన్ని నివారించండి. వేయించిన ఆహార పదార్థాల్లో.. నూనె ఎక్కువగా ఉంటుంది. ఇది అజీర్ణం, వికారం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అవి మీ కడుపులో రంబ్లింగ్ శబ్దాలను కూడా కలిగిస్తాయి, ఇది చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మీ ఇంటర్వ్యూకు వెళ్లే ముందు కచోరీ, ఫ్రెంచ్ ఫ్రైస్, పకోడి వంటి ఫ్రైడ్ ఫుడ్స్ తినొద్దు.



కెఫిన్.. చాలామంది ఇంటర్వ్యూలో యాక్టివ్‌గా సమాధానాలు చెప్పడానికి, రిఫ్రెష్‌గా ఉండటానికి.. కాఫీ, టీ లాంటి కెఫిన్ డ్రింక్స్ తాగుతుంటారు. అయితే, ఇంటర్వ్యూకు వెళ్లే ముందు ఇవి తాగితే.. మీ ఏకాగ్రత దెబ్బతింటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వాటికి పూర్తిగా దూరం పెట్టడం మంచిది.



షుగర్ ఫుడ్స్.. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు.. స్వీట్స్, కేక్‌లు, డోనట్స్, చాక్లెట్స్, క్యాండీలు వంటి.. చక్కెర అధికంగా ఉండే ఫుడ్స్ తినొద్దు. ఇవి వికారం, వణుకుతున్న అనుభూతిని కలిగిస్తుంది. వాటికి బదులు ప్రొటీన్, ఫైబర్ రిచ్ ఫుడ్స్ తీసుకోండి. ఇవి మమ్మల్ని యాక్టివ్‌గా ఉంచుతాయి.

కార్బోనేటేడ్ డ్రింక్స్.. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు.. కార్బోనేటేడ్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. వీటిలో చక్కెరతో పాటు కార్బన్ డై ఆక్సైడ్ కూడా ఉంటుంది. ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. దీనికారణంగా గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఎదురవుతాయి.

ఉత్తేజిత దినపత్రిక

## నారాయణవనం శ్రీ పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి

# బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ





తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, మే 05.

నారాయణవనం శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను టీటీడీ జెఈవో శ్రీ వి.వీరబ్రహ్మం ఆవిష్కరించారు. టీటీడీ పరిపాలనా భవనంలో గల జేఈవో కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ మే 11 నుండి 19వ తేదీ వరకు శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని తెలిపారు. మే 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మే 10న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారని చెప్పారు.

**ఆలయ నేపథ్యం:**

శ్రీ ఆకాశ మహారాజు నారాయణవనమును కేంద్రంగా చేసుకుని పాలించు చుండెను. వారు సంతానార్థియై పుత్రకామేష్టి యాగము చేయ సంకల్పించి, యాగ స్థలమును స్వర్ణ హలముతో దున్నుతున్న తరుణమున ఒక మందసము నందు పద్మముపై పడుకొన్న చందమున ఒక ఆడ శిశువు లభించింది. ఆ శిశువు పద్మోద్భవిగా తలచి పద్మావతి అను నామ ధేయము చేసి రాజు గారు ఆమెకు విద్యాబుద్ధులు నేర్పి, దిన దిన ప్రవర్ధమానురాలుగా చేయసాగెను. శ్రీ పద్మావతి దేవి యుక్త వయస్సు సమయములో ఒకనాడు తన చెలికత్తెలతో వన విహారము చేయు సందర్భమున వైకుంఠపతియైన శ్రీ శ్రీనివాసుడు వేట మార్గమున వచ్చుచుండగా ఆమెను చూచి, మోహించి, ఆమెని ఆకాశరాజు అనుమతితో సకల దేవతల సమక్షమున విళంబి నామ సంవత్సరం, వైశాఖ మాసం, శుక్లదశమి, శుక్రవారం వివాహం చేసుకొనెను. వారి జ్ఞాపకార్థం శ్రీ ఆకాశ మహారాజు నారాయణవనమున ఆలయ నిర్మాణం గావించి, వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం పూజా కైంకర్యాలు జరుపుటకు ఏర్పాటు చేసినారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు అర్చావతారియై, వృక్ష స్థలమున లక్ష్మీదేవి, దశావతార వడ్డాణం, వేట ఖడ్గం, దక్షిణ హస్తమున కల్యాణ కంకణధారియై, నేత్ర దర్శనముతో వేంచేసి యున్నారు.

ఈ ఆలయ ఆకాశరాజు పరిపాలన అనంతరం, కార్వేటినగరం సంస్థానాధీశుల ద్వారా నిర్వహించబడి, తదనంతరం 09-04-1967 సంవత్సరం నుండి టిటిడిలోకి చేర్చబడి నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, సంవత్సరోత్సవాలతో విలసిల్లుతున్నది.

**బ్రహ్మోత్సవాల్లో వాహన సేవల వివరాలు :**

తేదీ ఉదయం సాయంత్రం11-05-2025 ధ్వజారోహణం, పెద్దశేష వాహనం.12-05-2025 చిన్నశేష వాహనం, హంస వాహనం.13-05-2025 సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం.14-05-2025 కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం.15-05-2025 మోహినీ అవతారం, గరుడ వాహనం.16-05-2025 హనుమంత వాహనం, గజ వాహనం.17-05-2025 సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం.18-05-2025 రథోత్సవం కల్యాణోత్సవం, అశ్వవాహనం.
19-05-2025 చక్రస్నానం, ధ్వజావరోహణం.

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు,
రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

మే 18వ తేదీ రాత్రి 8.30 నుండి 10 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రూ.1000/- చెల్లించి గృహస్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డు, ఒక వడ, కుంకుమ బహుమానంగా అందజేస్తారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, ఏఈవో శ్రీ రవి ఇతర అధికారులు పాల్గొన్నారు.



# అక్రమ సస్పెన్షన్ లు వెంటనే ఆపాలి..వై.డి.ఆర్ స్వామి

నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి మే 5 -

- ఆన్ కాల్ డ్రైవర్ల జీతాలు పెంచాలి..
- ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు సెలవులు ఇవ్వాలి.
- కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలి..
- నైట్ అవుట్ అలవెన్స్ రూ.400 ఇవ్వాలి
- ఆర్టీసీ ఉద్యోగులు తహశీల్దార్ కు వినతి

: రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల అక్రమ సస్పెన్షన్లు , అక్రమ రిమూవల్స్ ను వెంటనే ఆపాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్, ఆర్టీసీ డిపో సెక్రెటరీ వై డి ఆర్ స్వామి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహశీల్దార్ శ్రీనివాసులు కు నందికొట్కూరు ఆర్టీసీ డిపో ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 యధావిధిగా అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి కిలోమీటర్లు బట్టి 300 నుండి 400 వరకు పాత పద్ధతిలో ఇవ్వాలన్నారు. గ్యారేజీ కార్మికులకు పనిష్మెంట్లు తగ్గించాలన్నారు. డిపోలో సస్పెన్షన్ లు ఎత్తివేయాలి అన్నారు . నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్ లు వెంటనే కార్మికులకు ఇవ్వాలన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ గవర్నమెంట్ వారు ఇచ్చిన సిక్కులకు జీతాలు ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు అనారోగ్య సేవలకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఆన్ కాల్ డ్రైవర్ల జీతాలు వెంటనే పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివి .రత్నం , డిబి. నారాయణ, హనీఫ్ , ఏ. నారాయణ , నరేష్ , సిసిఎస్ డెలిగేట్ రామస్వామి, కె .వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ ఎండి మొండివైఖరికి వ్యతిరేకంగా - సోమవారం ఎమ్మార్వో గారికి వినతి పత్ర సమర్పణ

ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి







ఎమ్మిగనూరు మే 5 సోమవారం పట్టణంలో స్థానిక డిపోరాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ రోజు05/05/25 తేదిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సోమవారం నాడు ఎమ్మిగనూరు డిపోలో రీజనల్ సహాయ కార్యదర్శి ఎన్ .పి .ఎం. సాహెబ్ గారి అధ్యక్షతన డిపో అధ్యక్ష, కార్యదర్శులు, ఎస్ . ఎం . రఫీక్,ముస్తాక్ అహ్మద్ గ్యారేజీ కార్యదర్శి కె.వి భాస్కర్ గారల ఆధ్వర్యంలో మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకునేటందుకుఎమ్మిగనూరు తహసిల్దార్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది.. ఈ సందర్భంగా రీజనల్ సహాయ కార్యదర్శి ఎన్.పి.ఎం.సాహెబ్ ఎం.ఆర్.ఓ. గారితో మాట్లాడుతూ క్రింది సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ ప్రసంగిస్తూ క్రింద పేర్కొన్న ప్రధాన డిమాండ్లను ఎమ్మార్వో గారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు ఎండి చొరవ తీసుకొని పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ ఏ పిలుపునిచ్చిన సమ్మె కైనా సిద్ధమని హెచ్చరించారు.

ప్రధాన డిమాండ్లు:-1/2019 భద్రతా సర్క్యులర్ ను అమలు చేయాలి ఉద్యోగులకు డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలిఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు పెంచాలిఉద్యోగులపై విధించే అక్రమ సస్పెన్స్,రిమూవల్స్ ఆపాలిపారదర్శకమైన ట్రాన్స్ఫర్ పాలసీని అమలు చేయాలి4 సంవత్సరాలుగా ఆగిపోయిన అన్నీ క్యాటగిరీల్లో ప్రమోషన్లు ఇవ్వాలి. హిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలిNon-operation ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీవితం ఇవ్వాలి. EHS స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలి. ఎలక్ట్రిక్ బస్సులను %RTC%/ప్రభుత్వం ద్వారా కొనాలిRTC లో ఉన్న విధంగానే క్యాడర్ స్ట్రెంత్ ను అమలు చేయాలి. రిటైర్డు ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణాలను అనుమతించాలి. ఆఫీసు సిబ్బంది దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగులకు అవసరాన్ని బట్టి %EOL% మంజూరు చేయాలి. డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేస్తున్నామని రాష్ట్ర కమిటీ ఏ పిలుపునిచ్చినా కూడా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో పాటు ప్రతి సభ్యుడు ఇదే విధంగా ఉత్సాహంతో పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డిపో సంయుక్త కార్యదర్శి ఎం.ఎల్.రెడ్డి,డిపో ప్రచార కార్యదర్శులు బజారప్ప, సహాయ కోశాధికారి కె. తిమ్మప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్. డి. గిరి, జి. నాగరాజు, పి. కె.వలి, యునూ స్ , కె. బి.రాముడు, ఎస్.వి.భాషా, బి.వెంకన్న,నాగలాపురం వీరన్న,తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ మాన్యపు భూములను పరిరక్షించండి

సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ మే 5



సి.బెళగల్ మండలం బ్రాహ్మణ దొడ్డి మజార గ్రామమైన మారం దొడ్డి గ్రామం నందు పురాతనం నుండి ఆలయములకు మాన్యపు భూములు కలవు. గ్రామంలోని ఆంజనేయస్వామికి 24 ఎకరాలు, శివాలయమునకు 24 ఎకరాలు, చెన్నకేశవ స్వామి కి 28 ఎకరాల మాన్యపు భూములు కలవని, ఈ భూములకు కొన్నిచోట్ల సరిహద్దులు అన్యక్రాంతమునకు గురి అయ్యాయని, కావున మా మీద దయవుంచి మారందొడ్డి గ్రామంలో జరగబోయే రీసర్వే నందు సర్వే నంబర్ 474లో 13 ఎకరాల 75 సెంట్లు, సర్వే నంబర్243, 2ఎలో 7 ఏకరాల 65 సెంట్లు, సర్వే నంబర్ 243,2బి లో 5ఎకరాల 16 సెంట్లు, సర్వే నంబర్ 18, 30లో 7ఎకరాల 44 సెంట్లు సదరు వ్యవసాయ భూమికి సంబంధించిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని మారందొడ్డి గ్రామస్తులు సోమవారం తహసిల్దార్ పురుషోత్తముడుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మారందొడ్డి గ్రామస్తులు రుక్మండ, పాండు, రాఘవేంద్ర, సోమన్న, విక్రమార్కుడు తదితరులు ఉన్నారు.

## ఈ నెల 7,8 తేదీలలో రాష్ట్ర విద్యాశాఖ, ఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మరియు ఆర్టీజీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతి జిల్లా రాక !: జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్

తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,మే 05:



ఈ నెల 7,8 తేదీలలో రాష్ట్ర విద్యాశాఖ,ఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మరియు ఆర్టీజీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతి జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల మే 7,8 తేదీలలో తిరుపతి జిల్లా పర్యటన నిమిత్త%శీ% ముంబై ఎయిర్పోర్ట్ నుండి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని 3.40 గంటలకు రేణిగుంట ఎయిర్పోర్ట్ నుండి రోడ్డు మార్గాన సాయంత్రం 5.10 గంటలకు వి ఎమ్ కె కల్యాణ మండపం, సత్యవేడు కు చేరుకొని 5.30 గంటల నుండి రాత్రి 8.00 గంటలకు వరకు అక్కడ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని, 8 వ తేది ఉదయం 10.30 గంటలకు వి ఎమ్ కె కల్యాణమండపం, సత్యవేడు నుండి బయలుదేరి ఉదయం 10.50 గంటలకు శ్రీసిటీ చేరుకొని 11.00 నుండి మధ్యాహ్నం 1.00గంట వరకు ఎల్ జి ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ వారి భూమి పూజ శంఖు స్థాపన కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం శ్రీసిటీ నుండి రోడ్డు మార్గం ద్వారా రేణిగుంట విమానాశ్రయం 2.30 కి మంత్రి చేరుకొని 2.40 గంటలకు ఫ్లైట్ లో హైదరాబాద్ కు వెళ్తారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా జాతర ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి.

తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, మే 05





. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా గంగ జాతర ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ నెల 6 నుండి ప్రారంభం కానున్న తాతయ్య గుంట గంగమ్మ జాతర కు జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఉదయం వివిధ శాఖల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తుల కొరకు చేసిన ఏర్పాట్లు, ఇందిరామైదానం, క్యూ లైన్లు, పొంగళ్ళు కొరకు చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గంగ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని అన్నారు. దర్శనానికి అనుమతించే ధర్మ దర్శనం, ప్రత్యేక దర్శనం, విఐపి లు వెళ్ళే క్యూ లైన్లను పక్కగా చేయాలని అన్నారు. దర్శనానంతరం భక్తులు వెలుపలికి వెళ్ళే ర్యాంప్, క్యూ లైన్లను ఆర్ అండ్ బి అధికారులు తనిఖీ చేయాలని అన్నారు. భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసే మార్గం ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ భక్తుల మధ్య తోపులాట జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయంలోనూ, పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి, శుభ్రంగా ఉంచాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. తుడా కార్యాలయంలో వి ఐ పి ల వాహనాలు పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. మిగిలిన వాహనాలు లోనికి రాకుండా ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఇందిరా మైదానంలో సాంస్కృతిక ప్రదర్శనలకు అనువుగా ఏర్పాట్లు చేయాలని తుడా అధికారులను ఆదేశించారు. ఆలయం కు వెళ్ళే మార్గంలో ఉన్న దుకాణదారులు రోడ్లపైకి రాకుండా మార్కింగ్ చేయాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పొంగళ్ళు పెట్టే మార్కెట్ లో తగు ఏర్పాటు చేసి, నీరు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు సాయంత్రం లోపు పూర్తి చేయాలని అన్నారు. కమిషనర్ వెంట రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, ఆర్డీవో రామ్మోహన్, ఏఎస్పీ రవి మనోహరాచారి, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, డి ఎస్పీ లు రామకృష్ణాచారి, భక్తవత్సలం, తుడా ఈ.ఈ.రవీంద్ర, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఆలయ ఈ ఓ జయకుమార్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఉత్సవ కమిటీ సభ్యులు మహేష్ యాదవ్, టిటిడి, తుడా , నగరపాలక సంస్థ, పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ కు రెండు దరఖాస్తులేనా....!




సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ మే 5

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తముడు తెలిపారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తముడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజల నుంచి 2 దరఖాస్తులు వచ్చాయని ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తముడు తెలిపారు. వీటిలో తమకు చెప్పకుండా తమ పొలంలో రీ సర్వే నిర్వహించారని సి. బెలగల్ గ్రామానికి చెందిన వ్యక్తి దరఖాస్తు ఇచ్చారని, మరొకటి భూ విస్తీర్ణానికి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తహసిల్దార్ తెలిపారు. ప్రతి వారం లాగే కొందరు మండల స్థాయి అధికారులు తరచుగా పిజిఆర్ఎస్కు గైహాజరవుతున్నారు. మరికొందరి అధికారులు కేవలం సంతకం చేసి వెళ్లడానికి మాత్రమే వచ్చి వెళుతున్నారు. మరికొందరు అధికారులు సమయపాలన పాటించకుండా వస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి ఈశ్వరయ్య స్వామి, ఏ.ఓ జి.మల్లేష్ కుమార్,ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ గోనే నాయక్, ఏపీఓ రామన్న, హౌసింగ్ ఏఈ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు మే 5 ఎమ్మిగనూరు ఎమ్మార్వో ఆఫీస్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి కమర్షియల్ ఆఫీసుగా ఎమ్మార్వో కార్యాలయం సిపిఎం

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి



ఎమ్మిగనూరు మే 5 సోమవారం పట్టణంలో స్థానిక రెవిన్యూ కార్యాలయంలో మండల ప్రజలు పట్టణ ప్రజలు రైతులు కార్మికులు అత్యవసరమైన దరఖాస్తు చేసుకున్న వాటిని పరిష్కరించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో గారికి మెమోరన్నం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పి గోవిందు మండల నాయకులు బి రాముడు మాట్లాడుతూ పేద ప్రజలు బడుగు బలహీన వర్గాల ప్రజలు రైతులు కార్మికులు పాసుపుస్తకాల కొరకు ఫ్యామిలీ సర్టిఫికెట్ కొరకు ఇంటి పట్టాల పేరు మార్పు కొరకు జనిన్ సర్టిఫికెట్ కొరకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కొరకు ఇన్కమ్ సర్టిఫికెట్ కొరకు ఇతర అత్యవసర సర్టిఫికెట్ల కొరకు ఎమ్మార్వో గారికి వీఆర్వో గారికి ఆర్ఐ గారికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలలు గడుస్తున్న సర్టిఫికెట్స్ మంజూరు చేయడం లేదని సిపిఎం పార్టీ నాయకులు తెలిపారు రెవెన్యూ కార్యాలయం అధికారులు కొద్దిమందికే పని చేస్తున్నారని అన్నారు పేద ప్రజలు మహిళలు ఉదయము రాత్రి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులు స్పందనలేదని అన్నారు కేవలం ప్రేక్షకపాత్ర మాత్రం వహించడం సరైంది కాదన్నారు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అధికారుల పనితీరు సర్వే చేయగా కేవలం కమర్షియల్ పద్ధతి అవలంబిస్తున్నారని ఉచిత సేవలు అందడం లేదని బాధితులు సిపిఎం పార్టీ నాయకులు ముందు ఆవేదన వ్యక్తపరిచారు ప్రస్తుత పరిస్థితుల్లో నిరుద్యోగులు ప్రజలు రైతులు కార్మికులు చాలా అవస్థ పడుతున్నారని తెలిపారు ఎమ్మార్వో కార్యాలయంలో అధికారుల దగ్గర ఉన్న పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షమున ఎమ్మార్వో కార్యాలయం బాధితులతో ముట్టడి చేస్తామని సిపిఎం పార్టీ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎం అబ్దుల్లా యు రమేష్ ప్రజా సంఘ నాయకులు బి కాలప్ప మోహిన్ ఆటో భాష తదితరులు

ఉత్తేజిత దినపత్రిక


# మరింత కఠినంగా డ్రైవింగ్ లైసెన్స్ ప్రాసెస్..



తెలంగాణ: తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ పొందడం ఇక మరింత కష్టతరం కానుంది. కొత్తగా ట్రాక్‌తో పాటు సిమ్యులేటర్‌పై డ్రైవింగ్ నైపుణ్యాలను శాస్త్రీయంగా పరీక్షించనున్నారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రవాణాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. మొదటి దశలో 18 ఆర్టీవో కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి రానుంది. సిమ్యులేటర్ పరీక్షలో డ్రైవింగ్ చేసేవారి స్పందనలను కూడా కెమెరాల ద్వారా పరిశీలిస్తారు.

తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ ప్రాసెస్ మరింత కఠినతరం కానుంది. డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షా విధానాన్ని సమూలంగా మార్చేందుకు రాష్ట్ర రవాణాశాఖ సిద్ధమవుతోంది. ప్రస్తుతం కేవలం ఖాళీ మైదానంలో వాహనం నడిపించి లైసెన్స్ పొందుతున్న విధానానికి తెరపడనుంది. కొత్త విధానంలో డ్రైవింగ్ నైపుణ్యాన్ని కేవలం ట్రాక్‌పైనే కాకుండా అత్యాధునిక సిమ్యులేటర్ పరికరంతో శాస్త్రీయంగా పరీక్షించనున్నారు. ఈ ప్రతిపాదనలకు రవాణాశాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.

ప్రస్తుతం అమల్లో ఉన్న విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ కావాల్సిన అభ్యర్థులు ఖాళీ మైదానంలోని ఆకారపు ట్రాక్‌లపై వాహనం నడిపితే డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేస్తున్నారు. రివర్స్ డ్రైవింగ్‌లో నైపుణ్యం లేకపోయినా.. కొందరు దళారుల సహాయంతో సులభంగా డ్రైవింగ్ టెస్ట్ పాసవుతున్నారు. ఇలా సరైన డ్రైవింగ్ నైపుణ్యం లేని వారు రోడ్లపై వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. లేదా వారు ఇతరుల ప్రమాదాలకు కారణమవుతున్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. 2023లో 22,093 ప్రమాదాలు జరగగా.. 2024 నాటికి అది 25,934కు చేరుకుంది. ఈ ప్రమాదాల్లో వరుసగా 28,682, 31,559 మంది బాధితులయ్యారు. ఈ ప్రమాదాలకు సరైన డ్రైవింగ్ రాకపోవడం ఒక ముఖ్య కారణమని గుర్తించిన రవాణాశాఖ, డ్రైవింగ్ నైపుణ్యాన్ని మరింత కఠినంగా పరీక్షించాలని నిర్ణయించింది. కొత్త విధానంలో భాగంగా.. మైదానంలోని టెస్ట్ ట్రాక్‌తో పాటు, సిమ్యులేటర్‌పై కూడా డ్రైవింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. సిమ్యులేటర్ అనేది నిజమైన కారు నమూనాను పోలి ఉండే ఒక పరికరం. ఇందులో కారులో ఉండే స్టీరింగ్, క్లచ్, బ్రేక్, గేర్లు అన్నీ ఉంటాయి. హార్డ్‌వేర్‌తో పాటు, ఎదురుగా ఒక స్క్రీన్ ఉంటుంది. దానిపై సాఫ్ట్‌వేర్ ద్వారా రహదారి, ఇతర వాహనాలను చూడవచ్చు. సిమ్యులేటర్‌పై అభ్యర్థి స్టీరింగ్ తిప్పడం, గేర్లు మార్చడం వంటి చర్యలను బట్టి స్క్రీన్‌పై వాహనం కదులుతుంది. పక్కనుంచి ఇతర వాహనాలు వెళుతున్నట్లు కూడా ఉంటుంది. అంతేకాకుండా, వర్షం లేదా పొగమంచు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా సిమ్యులేటర్‌లో సృష్టిస్తారు. అప్పుడు అభ్యర్థి డ్రైవింగ్ నైపుణ్యం ఎలా ఉందో విశ్లేషిస్తారు.

డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యే వారి ముఖ కవళికలు కెమెరాల్లో రికార్డ్ అవుతాయి. అధిక ట్రాఫిక్ ఉన్నప్పుడు లేదా ఇతర వాహనాలు దగ్గరగా వస్తున్నప్పుడు అభ్యర్థి ఎలా స్పందిస్తున్నారు, ఒత్తిడికి గురవుతున్నారా? లేదా? అనే విషయాలను కూడా విశ్లేషిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 61 ఆర్టీవో కార్యాలయాలు ఉండగా.. మొదటి దశలో 18 కార్యాలయాల్లో 34 సిమ్యులేటర్లను ఏర్పాటు చేయాలని రవాణాశాఖ ప్రతిపాదించింది. ఈ సిమ్యులేటర్లను ప్రైవేట్ సంస్థల ద్వారా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పరీక్ష నిర్వహణకు అతి తక్కువ ఫీజును ప్రతిపాదించే సంస్థను టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. ఫీజుల రూపంలో వచ్చే ఆదాయంలో 50 శాతం రవాణాశాఖకు వచ్చేలా అధికారులు నిబంధనలు రూపొందిస్తున్నారు.

# ఒక్క పథకంతో.. 900 కోట్ల ఆదాయం..




హైదరాబాద్: హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపు పథకం ఏప్రిల్ 1 నుండి ప్రారంభమవుతుంది. దీని ద్వారా పన్ను చెల్లించిన వారికి 5 శాతం రిబేటు లభిస్తుంది. ఈ పథకం జీహెచ్ఎంసీకి ఆదాయాన్ని పెంచడానికి.. పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూర్చడానికి ఉద్దేశించబడింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చెల్లింపు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పన్ను చెల్లింపు విధానం ఏప్రిల్ 30 వరకు ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి భారీ మొత్తంలో ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రోత్సాహం అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎప్పటినుంచో 'ఎర్లీ బర్డ్' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో.. అంటే ఏప్రిల్ 1వ తేదీ నుండి మొదలవుతుంది. ఈ పథకం కింద.. ఆస్తి పన్నును ఏప్రిల్ 30వ తేదీలోగా ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రిబేటు లభిస్తుంది.

ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం పన్ను చెల్లింపుదారులను ముందుగానే పన్నులు చెల్లించేలా ప్రోత్సహించడం. దీనివల్ల జీహెచ్ఎంసీకి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ఆదాయం సమకూరుతుంది. ఈ నిధులను నగర అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించవచ్చు.

మరోవైపు.. పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రిబేటు లభించడం వల్ల వారిపై ఆర్థిక భారం కొంతమేరకు తగ్గుతుంది. గత కొన్నేళ్లుగా ఈ పథకానికి నగర ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా ఏప్రిల్ 1 నుండి 30 వరకు ఈ పథకం అమల్లో ఉండగా.. రికార్డు స్థాయిలో 79 లక్షల మందికి పైగా పన్ను చెల్లింపుదారులు దీనిని సద్వినియోగం చేసుకున్నారు. దీని ద్వారా జీహెచ్ఎంసీకి రూ. 900 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు 70 కోట్ల రూపాయలు అధికం. జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను చెల్లింపు ప్రక్రియను కూడా చాలా సులభతరం చేసింది. పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్ ద్వారా జీహెచ్ఎంసీ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చు. అంతేకాకుండా.. మీసేవా కేంద్రాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్లు మరియు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో కూడా పన్నులు చెల్లించే సౌకర్యం ఉంది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు వివిధ రకాల పేమెంట్ గేట్‌వేలను అందుబాటులో ఉంచారు. సమయానికి పన్ను చెల్లించని వారికి ప్రతి నెలా 2 శాతం చొప్పున అపరాధ రుసుము విధిస్తారు. కాబట్టి.. ఎర్లీ బర్డ్ పథకం ద్వారా రిబేటు పొందడంతో పాటు అపరాధ రుసుము భారం నుండి కూడా తప్పించుకోవచ్చు.

## బసంత్‌నగర్‌లో కాదు.. మరో ప్రాంతానికి తరలింపు..!



తెలంగాణ: తెలంగాణలో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పెద్దపల్లిలో నిర్మించ తలపెట్టిన విమానాశ్రయాన్ని బసంత్‌నగర్‌కు బదులుగా అంతర్గాం ప్రాంతానికి తరలించనున్నారు. బసంత్‌నగర్‌లోని వాతావరణ, భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో అంతర్గాం మండలంలో 591 ఎకరాల భూమిని గుర్తించి, సంబంధిత నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించింది.

తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. పెద్దపల్లి ప్రాంతంలోనూ కొత్తగా ఎయిర్‌పోర్టు నిర్మించనున్నారు. అయితే ముందుగా అనుకున్న బసంత్‌నగర్ కాకుండా మరో ప్రాంతానికి ఎయిర్‌పోర్టు తరలించనున్నారు. బసంత్‌నగర్‌లో వాతావరణ పరిస్థితులు, భౌగోళిక అంశాలు అనుకూలంగా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం మండలంలో సుమారు 591 ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. ఈ భూములకు సంబంధించిన రెవెన్యూ మ్యాపులు, గత పదేళ్ల వాతావరణ రిపోర్టులు, సైట్ వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి సమర్పించారు.

అంతర్గాంలో ఎంపికైన భూములతో పాటు, మరికొన్ని భూములను అదనంగా సేకరించే అవకాశమున్నదని సమాచారం. వాతావరణ నివేదికలు కూడా అనుకూలంగా ఉండటంతో, ఈ భూములు విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల కేంద్ర అధికారుల బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చింది. ఈ దశలో, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి, అంతర్గాంలో ఫ్రీ ఫీజిబిలిటీ స్టడీ చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఇదివరకే బసంత్‌నగర్‌లో (రామగుండం సమీపంలో) దాదాపు 260 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం నిర్మించారు. అప్పట్లో అక్కడ ఎయిర్‌స్ట్రిప్‌తోపాటు విమానాలు కూడా నడిచాయి. కానీ కాలక్రమంలో ఆ సేవలు నిలిచిపోయాయి.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విమానాశ్రయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చింది. వరంగల్ జిల్లా మామునూరు, బసంత్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రాన్ని కోరుతూ లేఖలు పంపింది. ఇప్పటికే మామునూరులో విమానాశ్రయానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. అక్కడ అదనంగా అవసరమైన భూముల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇక బసంత్‌నగర్‌లో పలు సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతం ఉన్న స్థలంలో విమానాశ్రయం నిర్మాణం సాధ్యపడలేదు. అయినా పెద్దపల్లి జిల్లాలోనే వేరే ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది.

ఈ క్రమంలోనే అంతర్గాం మండలంలో భూములను పరిశీలించింది. కాగా, ఎయిర్‌పపోర్టు నిర్మాణంతో అంతర్గాం ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. ఈ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. ఊహించనంతగా అభివృద్ధి జరగనుంది.

# మే 5న అటు వెళ్లకండి.. రోడ్లన్నీ బంద్..

హైదరాబాద్: మే 5న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ నేపథ్యంలో రాచకొండ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11:50 గంటల వరకు భారీ వాహనాలపై నిషేధం ఉంటుంది. వివిధ ప్రాంతాల నుండి ఉప్పల్ వెళ్లే వాహనాల కోసం ట్రాఫిక్ మళ్లింపులు ఏర్పాటు చేశారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు కోరారు. మ్యాచ్ సమయానికి కనీసం ఒక గంట ముందుగానే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

క్రికెట్ అభిమానులకు పండుగ వాతావరణం నెలకొంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా మే 5వ తేదీన ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు హోరాహోరీగా తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు వేలాది మంది ప్రేక్షకులు తరలిరానుండటంతో.. రాచకొండ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. మ్యాచ్ జరిగే ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ముఖ్యంగా.. స్టేడియం పరిసరాల్లో లారీలు, డంపర్లు, ఎర్త్ మూవర్లు, వాటర్ ట్యాంకర్లు, ఆర్ఎంసీ ట్రక్కుల వంటి



భారీ వాహనాలపై పూర్తి నిషేధం విధించారు. ఈ ఆంక్షలు మే 5వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11:50 గంటల వరకు అమల్లో ఉంటాయి. పోలీసులు ప్రజలు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి.. ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని తమకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాఫిక్ మళ్లింపుల వివరాలను కూడా పోలీసులు స్పష్టంగా తెలియజేశారు.

రామంతపూర్ నుండి ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు స్ట్రీట్ నెంబర్ 8 మీదుగా ఉప్పల్ ఎక్స్ రోడ్ వైపు మళ్లిస్తారు. దీనివల్ల రామంతపూర్ నుండి నేరుగా ఉప్పల్‌కు వెళ్లే వాహనాల రద్దీ తగ్గుతుంది. అలాగే, చెంగిచెర్ల, బోడుప్పల్ మరియు పీర్జాదిగూడ నుండి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను టయోటా షోరూమ్ ముందు నుండి హెచ్ఎండీఏ భగాయత్ రోడ్డు మీదుగా నాగోల్ వైపు మళ్లించనున్నారు. ఈ మార్గం ద్వారా వచ్చే వాహనాలు నేరుగా ఉప్పల్‌లోకి ప్రవేశించకుండా నాగోల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఎల్బీ నగర్ నుండి నాగోల్ లేదా ఉప్పల్ వెళ్లే వాహనాల కోసం నాగోల్ మెట్రో స్టేషన్ కింద ఉన్న యు-టర్న్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. ఈ వాహనాలు హెచ్ఎండీఏ లేఅవుట్ మరియు బోడుప్పల్ మీదుగా చెంగిచెర్ల ఎక్స్ రోడ్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. తార్నాక నుండి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను హబ్సిగూడ ఎక్స్ రోడ్ వద్ద ఎడమవైపుకు తిప్పి, నాచారం, ఐఓసిఎల్ చెర్లపల్లి, స్ట్రీట్ నెంబర్ 8 మరియు హబ్సిగూడ మీదుగా మెట్రో పిల్లర్ 972 వద్ద ఉన్న యు-టర్న్ ద్వారా ఉప్పల్ ఎక్స్ రోడ్ వైపు మళ్లిస్తారు. ఈ మార్గం తార్నాక నుండి వచ్చే వాహనాలకు ఉప్పల్‌కు చేరుకోవడానికి ప్రత్యామ్నాయంగా ఉంటుంది. పోలీసులు ప్రజలకు సూచిస్తూ.. మ్యాచ్ సమయానికి కనీసం ఒక గంట ముందుగానే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. సాధ్యమైనంత వరకు వ్యక్తిగత వాహనాలకు బదులుగా మెట్రో రైలు వంటి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలని సూచించారు. స్టేడియం పరిసరాల్లో పార్కింగ్ స్థలాలు పరిమితంగా ఉంటాయని.. కేవలం పాస్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. దీంతో పాటు.. ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.

# తెల్లవారుజామునే పని కానిచ్చేస్తున్నారు..

**బాపట్లకు చెందిన ఓ యువకుడు తన తల్లితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి చీరాలకు వెళ్లేందుకు సింహపురి ఎక్స్‌ప్రెస్ ఎక్కగా, రైలు బయలుదేరే సమయంలో ప్లాట్‌ఫాంపై ఉన్న ఒక వ్యక్తి ఆ యువకుడి తల్లి మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కొని పారిపోయాడు.**




సికింద్రాబాద్: వేసవి రద్దీతో ట్రైన్లు కిటకిటలాడుతున్నాయి. కొన్ని ట్రైన్లలో అయితే కాలు పెట్టేందుకు కూడా జాగా ఉండట్లేదు. అదే సమయంలో దొంగలు రెచ్చిపోతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అలసటతో గాఢ నిద్రలోకి జారుకుంటుండగా.. అదే అదనుగా చోరీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామునే చోరీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే పోలీసులు అలర్ట్ జారీ చేస్తున్నారు. అనుమానితులు కనిపిస్తే.. 100 లేదా 139కు కాల్ చేయాలని సూచిస్తున్నారు. వేసవి సెలవుల కారణంగా ట్రైన్లలో రద్దీ విపరీతంగా పెరిగింది. పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లే కుటుంబాలతో బోగీలన్నీ కిక్కిరిసి ఉంటున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అలసిసొలసి గాఢ నిద్రలో చుట్టుపక్కల ఏం జరుగుతుందో పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న దొంగలు రెచ్చిపోతున్నారు. అవకాశాన్ని వినియోగించుకుంటూ అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతో తమ విలువైన వస్తువులు పోగొట్టుకున్న బాధితులు దిక్కుతోచని స్థితిలో సమీపంలోని రైల్వే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి సంవత్సరం వెయ్యికి పైగా దొంగతనాల ఫిర్యాదులు నమోదవుతున్నాయి. దొంగలు ఇప్పుడు చోరీ చేసే విధానాన్ని కూడా మార్చారు. ముఖ్యంగా తెల్లవారుజామున నిద్రమత్తులో ఉన్న దూర ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలకు చెందిన చిల్లర దొంగలు ముఠాలుగా ఏర్పడి వరుస చోరీలకు పాల్పడుతుండటం గమనార్హం. రైలు కదలడానికి కొద్దిసేపటి ముందు లేదా వేగం బాగా తగ్గిన తర్వాత దొంగతనాలకు పాల్పడుతున్నారు. కిటికీలు, డోర్ల దగ్గర కూర్చున్న మహిళా ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని వారి సెల్‌ఫోన్లు, మెడలోని గొలుసులు లాక్కొని పారిపోతున్నారు. లింగంపల్లికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగిని గత నెలలో విజయనగరం వెళ్లి తిరిగి వస్తుండగా నాగవల్లి ఎక్స్‌ప్రెస్‌లో తెల్లవారుజామున ఆమె మెడలోని 38 గ్రాముల బంగారు గొలుసును ఎవరో లాక్కొని వెళ్లారు. అలాగే.. బాపట్లకు చెందిన ఓ యువకుడు తన తల్లితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి చీరాలకు వెళ్లేందుకు సింహపురి ఎక్స్‌ప్రెస్ ఎక్కగా, రైలు బయలుదేరే సమయంలో ప్లాట్‌ఫాంపై ఉన్న ఒక వ్యక్తి ఆ యువకుడి తల్లి మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కొని పారిపోయాడు. ఈ నేరాలను నియంత్రించడానికి రైల్వే పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పెట్రోలింగ్ సిబ్బందితో భద్రతను పెంచామని అధికారులు తెలిపారు. వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సిగ్నల్స్‌ను ట్యాప్ చేసి రైళ్లను ఆపి దోపిడీలు చేసే ముఠాలు ప్రస్తుతం లేవని, ప్రస్తుతం జేబుదొంగలు, చైన్ స్నాచర్లే ఎక్కువగా దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసులు వెల్లడించారు. దూర ప్రయాణాల్లో ప్రయాణికులు బంగారు ఆభరణాలు ధరించకపోవడం ఉత్తమమని సూచించారు. ఒకవేళ అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా చోరీ జరిగినా వెంటనే డయల్ 100 లేదా 139కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# 16 ఏళ్ల బాలుడిని 28 ఏళ్ల యువతి.. పోక్సో కేసు నమోదు

హైదరాబాద్: రోజురోజుకు సమాజంలో హింస పెరుగిపోతోంది. దానికి లింగం, వయస్సు లాంటి ఎలాటి తారతమ్యాలు ఉండటం లేదు. ముక్కుపచ్చలాని పసిగుడ్డును చూస్తే కళ్లు మూసుకుపోతాయి ఒకడికి. కాటికి కాళ్లు చాపిన బామ్మపై కోరిక కలుగుతదని మరొకడికి.తమ కోరికలు తీర్చుకునేందుకు ఎలాంటి అడ్డదారులైనా తొక్కుతారు. మహిళలపైనే కాకుండా.. భార్యల చేతిలో హత్యకు గురయ్యే భర్తలు, మహిళల కోరికలకు బలయ్యే మగాళ్లు కూడా రోజురోజుకు ఎక్కువే అయితున్నారు.

లైగింక వేధింపులు, గృహహింస, అత్యాచారం, పోక్సో కేసులు, కాస్టింగ్ కౌచ్.. ఎక్కువగా మహిళ విషయంలో వింటుంటాం. అలా అని పురుషులకు ఇలాంటి ఇబ్బందులు లేవని కాదు. కాకపోతే బయటకు వచ్చేవి తక్కువగా ఉండటం, చాలా మంది చెప్పుకోవడానికి సంశయిస్తుంటారు. చెప్పినా.. మగాడివి నీకేందిరా అనే మాటలే వినిపిస్తాయి. కానీ, ఇలాంటి విషయాల్లో చాలామంది పురుషులు కూడా సతమతమవుతుంటారు. ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.



16 ఏళ్ల బాలుడిపై 28 ఏళ్ల యువతి లైంగికంగా వేధించిందని బాలుడి తల్లి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి వచ్చింది. తన లైంగిక కోరిక తీర్చుకునేందుకు బాలుడికి ఆశ చూపి లోబరుచుకుందని బాధితుడి తల్లి ఆరోపిస్తుంది. అంతేకాకుండా లైంగికంగా వేధించి, శారీరకంగా, మానసికంగా హింసించిందని వాపోయింది. తన వాంఛ తీర్చుకునేందుకు తన కుమారుడి జీవితంతో ఆడుకుందని పోలీసులను ఆశ్రయించింది ఆ తల్లి. పోక్సో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆ యువతిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లైంగిక వేధింపులకు పురుషులేం అతీతులు కాదు. స్త్రీల కోరికలకు బలయ్యే మగాళ్లు కూడా సమాజంలో లేకపోలేదు. తమ అవసరాల కోసం మగాళ్లను లోబరుచుకొని వేధించే మహిళలు కూడా ఉన్నారు. కారణం ఏదైనా కావచ్చు.. కానీ పురుషులు కూడా హింసను ఎదుర్కుంటూనే ఉన్నారు. భార్య చేతిలో, ప్రేయసి దగ్గర, స్నేహితురాళ్ల ముందు అవమానాలకు గురయ్యే మగరాయుల్లు ఎందరో ఉన్నారు. షీ టీం వలె.. హీ టీమ్ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందేమో..!

# తెలంగాణలో మరో అంతర్జాతీయ ఫెస్టివల్..

తెలంగాణ: ఫెస్టివల్ అంటే ఎవరికైనా ఆనందంగా ఉంటుంది. అదికూడా స్నేహితులతో కలిసి చేసుకుంటే ఆ సంతోషమే వేరు. అలాంటి ఆ ఆనందకర ఘడియలకు తెలంగాణ రాష్ట్రం వేదిక కానుంది. హైదరాబాద్ నగరంలో మొట్టమొదటిసారిగా టమాటా ఫైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం మే 11వ తేదీన ఉదయం 10 గంటలకు మొదలు అవుతుంది. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న సుమారు 25 వేల జాతుల అరుదైన వృక్షాలు, మొక్కలు, శిల్పాలతో కూడి ఉన్న 'ఎక్స్‌పీరియం' ఎకో పార్క్ దీనికి వేదిక కానుంది.

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం సరికొత్త ఉత్సాహానికి వేదిక కానుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపేందుకు ఒక అద్భుతమైన



అవకాశం త్వరలో నగరవాసులను పలకరించనుంది. హైదరాబాద్ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒక ప్రత్యేకమైన.. ఉల్లాసభరితమైన టమాటా ఫైట్ ఫెస్టివల్ జరగబోతోంది. ఈ టమాటా ఫైట్ ఫెస్టివల్ స్పెయిన్‌లోని ప్రసిద్ధ లా టమాటినా పండుగ నుండి ప్రేరణ పొందింది.

వేల కిలోల టమాటాలను ఒకరిపై ఒకరు విసురుకుంటూ ఆనందించే ఈ ప్రత్యేకమైన వేడుక మే 11, 2025న ఉదయం 10 గంటల నుండి హైదరాబాద్ నగర శివారులోని 'ఎక్స్‌పీరియం' ఎకో పార్క్‌లో జరగనుంది. ఈ ఎకో పార్క్ ఒక ప్రత్యేకమైన అనుభూతినిస్తుంది. 85 దేశాల నుండి దిగుమతి చేసుకున్న సుమారు 25 వేల జాతుల అరుదైన వృక్షాలు, మొక్కలు మరియు అద్భుతమైన శిల్పాలతో ఇది ఆహ్లాదకరమైన ప్రదేశంగా విరాజిల్లుతోంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు వద్ద ప్రముఖ వ్యాపారవేత్త రాందేవ్ రావు ఆరున్నరేళ్ల సుదీర్ఘ శ్రమతో 150 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశాలమైన ఎకో పార్క్‌ను తీర్చిదిద్దారు. దేశంలోనే అతి పెద్దదిగా పేరుగాంచిన ఈ ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది జనవరిలో ప్రారంభించారు. ఇక్కడ పాల్గొనేవారు వేల కిలోల టమాటాలను ఒకరిపై ఒకరు విసురుకుంటూ తమ ఆనందాన్ని వెలిబుచ్చుతారు. అంతేకాదు.. ఈ వేడుకలో లైవ్ డీజే సంగీతం యువతను ఉర్రూత లూగిస్తుంది.. నృత్య ప్రదర్శనలు అందరినీ అలరిస్తాయి. రుచికరమైన ఆహారాన్ని అందించే ఫుడ్ స్టాల్స్‌తో పాటు.. షాపింగ్ ప్రియుల కోసం ప్రత్యేకంగా మార్కెట్ కూడా ఏర్పాటు చేయబడుతుంది. పిల్లలు, పెద్దలు ఆనందించేందుకు ప్రత్యేకమైన ఫన్ జోన్స్ కూడా ఉంటాయి. ఈ ప్రత్యేకమైన అనుభవాన్ని పొందడానికి టికెట్ల ధరలు రూ. 499 నుండి ప్రారంభమై రూ. 3,499 వరకు వివిధ కేటగిరీలలో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వేసవి తాపంతో అల్లాడుతున్న హైదరాబాదీలకు ఈ టమాటా ఫైట్ ఫెస్టివల్ ఒక సరికొత్త.. సరదా అనుభవాన్ని అందించడంలో సందేహం లేదు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి నవ్వులు, కేరింతల మధ్య గడిపేందుకు ఇది ఒక చక్కని అవకాశం.



# ‘ఏ ఒక్కరినీ వదిలిపెట్టం’.. పహల్గాం ఘటనపై అమిత్ షా

దేశంలో ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే తమ ప్రభుత్వ సంకల్పమని, దీన్ని సాధించి తీరుతామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఉగ్రవాదంపై పోరులో దేశవాసులే కాకుండా.. ప్రపంచమంతా భారత్ వెంటే నిలుస్తోందని తెలిపారు. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. “దశాబ్దాలుగా కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నవారిపై మోదీ ప్రభుత్వం బలంగా పోరాడుతోంది. పౌరుల ప్రాణాలను తీయడం ద్వారా యుద్ధంలో గెలిచామని ఉగ్రమూకలు భావించడం పొరపాటే అవుతుంది. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తున్న వారందరికీ ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాం. ఇది యుద్ధం ముగింపు కాదు. ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. ప్రతి ఒక్కరికీ తగిన విధంగా సమాధానం చెబుతాం” అని అమిత్ షా హెచ్చరించారు.

## రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం

యోగా గురువు రామ్‌దేవ్ బాబాపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హమ్‌దార్డ్ పానీయం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్ విచారిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. “ఎవరి నియంత్రణలో లేకుండా ఆయన తన సొంత ప్రపంచంలో జీవిస్తున్నారు” అని పేర్కొంది.ఏప్రిల్ 22న జరిగిన విచారణలో భాగంగా హమ్‌దార్డ్ ఉత్పత్తులపై భవిష్యత్తులో ఎలాంటి ప్రకటనలు జారీ చేయొద్దని, వీడియోలు షేర్ చేయొద్దని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అలాగే ఆ తరహా వ్యాఖ్యలు షాక్ గురిచేశాయని తీవ్రంగా స్పందించింది. అవి ఏమాత్రం సమర్థనీయం కాదని తేల్చిచెప్పింది. గతంలో తప్పుదోవ పట్టించే ప్రకటనల వ్యవహారంలో పతంజలి ఆయుర్వేద్ సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటనల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కూడా జరిగింది. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని వారు కోర్టుకు విన్నవించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం .. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది.

# ‘ధ్రువ్’ హెలికాప్టర్లకు లైన్ క్లియర్




పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొన్ని నెలల క్రితం నిలిపివేసిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ ధ్రువ్ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో వాటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ.. నౌకాదళంలో ఉన్న ఈ హెలికాప్టర్లకు మాత్రం అనుమతివ్వలేదని తెలిసింది.

ఈ ఏడాది జనవరి 5న గుజరాత్‌లోని పోరుబందర్‌లో కోస్టుగార్డుకు చెందిన ధ్రువ్ హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు సహా మరో డైవర్ ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందు ఓసారి ఈ హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఇలా సాంకేతిక లోపం తలెత్తడం, ఈ క్రమంలో ప్రమాదానికి గురవుతున్న నేపథ్యంలో ధ్రువ్ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు.

పహల్గాం ఉగ్రదాడి అనంతరం శ్రీనగర్‌తోపాటు పరిసర ప్రాంతాలకు సైన్యాన్ని మోహరించేందుకు పరిమిత సంఖ్యలో అనుమతి ఇచ్చారు. అయితే, వీటిని పరీక్షించిన డిఫెక్ట్ ఇన్వెస్టిగేషన్ కమిటీ.. చాపర్ సేవలను పునరుద్ధరించవచ్చని సిఫార్సు చేసినట్లు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వెల్లడించింది. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, కోస్ట్‌గార్డుల్లో ఉన్న చాపర్లకు మాత్రమే అనుమతి వచ్చినట్లు సమాచారం.

దేశీయంగా రూపొందించి, తయారు చేసిన అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ ఇది. రెండు ఇంజిన్లు ఉండే దీని బరువు 5.5 టన్నులు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేస్తుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కోస్ట్‌గార్డుల్లో కలిపి మొత్తంగా 330 ఉన్నాయి. కేవలం ఇండియన్ ఆర్మీలోనే 150 హెలికాప్టర్లు సేవలందిస్తున్నట్లు సమాచారం.

## పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు అమరవీరుల హోదా ఇవ్వాలి : రాహుల్ గాంధీ



దిల్లీ: ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి అమరవీరుల హోదా కల్పించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఉగ్రదాడిలో మృతి చెందినవారి కుటుంబ సభ్యుల్ని ఆయన కాన్పుర్‌లో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్న రాహుల్ గాంధీ.. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అమరవీరుల హోదా కల్పించాన్న బాధిత కుటుంబాల డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన పాశవిక దాడిలో తమ వారిని పోగొట్టుకొని విషాదంలో ఉన్న కుటుంబాల మనోభావాలను గౌరవించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. శుభం ద్వివేది కుటుంబ సభ్యుల్ని కలిసిన అనంతరం రాహుల్‌మీడియాతో మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని కోరుతున్నాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26మంది మృతి చెందగా.. వీరిలో ఎక్కువ మంది పర్యాటకులే ఉన్న విషయం తెలిసిందే.

## రిజర్వేషన్లు 68 శాతానికి పెంచాలి: ఖర్గే



హుబ్బళ్లి: దేశంలో రిజర్వేషన్లను 68 శాతానికి పెంచాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రాన్ని డిమాండ్ చేశారు. త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కల సేకరణతోపాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని 68 శాతానికి పెంచాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా హుబ్బళ్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో “రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందాం” అనే పేరుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. కేంద్రం తొలుత కులగణన చేపట్టడానికి ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ఒత్తిడి వల్ల దేశవ్యాప్తంగా కులగణనకు అంగీకరించింది. ఈ మేరకు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి తమిళనాడు ప్రభుత్వం అందిస్తున్న విధంగా 68 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నా. కేంద్రం 2021లోనే కులగణనను ఎందుకు చేపట్టలేదో చెప్పాలి? అప్పుడే కులగణన చేసి ఉంటే.. పౌరుల స్థితిగతులు, వారి తలసరి ఆదాయం, జీతాలు, ఉద్యోగాల సంఖ్య, పేదరికంలో ఉన్న వారి వివరాలు మనకు తెలిసేవి” అని వ్యాఖ్యానించారు.

## జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా అనుసంధానం!

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని వెల్లడించింది. తద్వారా అత్యంత కచ్చితత్వంతో ఓటరు జాబితాను నవీకరించే వీలుంటుందని పేర్కొంది.

# భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదు



## ఫరుక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఘటనపై భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. కశ్మీర్‌లోని భద్రతా, ఇంటెలిజెన్స్ లోపాలను ఆయన ఎత్తి చూపారు.

“రేపటి రోజు ఎలా ఉండబోతుందో ఎవరికీ తెలియదు. ఇరుదేశాలు యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. అలా జరగకుండా ఉండాలంటే పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కారణమైన ఉగ్రవాదులు, దాని వెనక ఉన్న వారిని వీలైనంత తొందరగా పట్టుకోవాలి. యుద్ధాన్ని నివారించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భద్రతా, ఇంటెలిజెన్స్‌లో ఉన్న లోపాలు కూడా ఉగ్రదాడి జరిగేందుకు కారణమని అనడంలో సందేహం లేదు” అని మీడియా సమావేశంలో ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు.

ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. దేశం విడిచి వెళ్లిపోవాలని భారత్‌లోని పాక్ జాతీయులకు భారత ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అందుకు గడువు కూడా విధించింది. ఇప్పటివరకు 780 మందికి పైగా దేశం విడిచి వెళ్లిపోయారు.

## భారత్‌కు ఫుల్ సపోర్ట్ ప్రకటించిన అమెరికా

భారత రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ కు అమెరికా డిఫెన్స్ సెక్రటరీ పీట్ హెగ్సేత్ ఇవాళ ఫోన్ చేశారు. జమ్మూ, కశ్మీర్ పహల్గాంలో అమాయక పౌరులను చంపడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భారత పౌరులకు జరిగిన నష్టానికి ఆయన తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అమెరికా భారతదేశంతో సంఘీభావంగా నిలుస్తుందని చెప్పారు. భారతదేశం తనను తాను రక్షించుకునే హక్కుకు అమెరికా ఎప్పుడూ మద్దతు ఇస్తుందని కార్యదర్శి హెగ్సేత్ అన్నారు. ఉగ్రవాదంపై భారతదేశం చేస్తున్న పోరాటంలో అమెరికా ప్రభుత్వం యొక్క సంపూర్ణ మద్దతును ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్.. పాకిస్థాన్ ఎంతో కాలంగా చేస్తున్న అకృత్యాలని పీట్ హెగ్సేత్ కు వివరించారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం, శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చే చరిత్రను కలిగి ఉందని రాజ్ నాథ్ వివరించారు. ప్రపంచ సమాజం ఇలాంటి దారుణమైన ఉగ్రవాద చర్యలను స్పష్టంగా, నిస్సందేహంగా ఖండించడం పిలుపునివ్వడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు.

## కరాచీ, లాహోర్‌ల గగనతలం తాత్కాలికంగా మూసివేత!

ఇస్లామాబాద్: కరాచీ, లాహోర్ నగరాల గగనతలం తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. భద్రతా కారణాల దృష్ట్యా మే నెలలో రోజూ కొన్ని గంటలపాటు కరాచీ, లాహోర్ గగనతలాన్ని మూసి ఉంచనున్నట్లు గురువారం ఆ దేశ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పహల్గాం ఉగ్రదాడి తో భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ దాయాది దేశం పలు ముందస్తు చర్యలు చేపట్టింది. భారత్ దాడి చేస్తుందనే భయాందోళనల నేపథ్యంలో విమానాలకు గగనతలం మూసివేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కరాచీ, లాహోర్ గగనతలం రోజూ ఉదయం 4 గంటల నుంచి 8 వరకు మూసివేయనున్నట్లు తెలిపింది. “4 గంటల పాటు గగనతలం మూసివేయడం వల్ల వాణిజ్య విమాన కార్యకలాపాలకు పెద్దగా అంతరాయం ఉండదు. ఆ సమయాల్లో విమానాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నాం” అని పౌర విమానయాన అథారిటీ (సీఏఏ) ప్రకటించింది.

## సరిహద్దులో సైన్యాన్ని మోహరిస్తున్న పాకిస్థాన్!

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే పాకిస్థాన్ తన సరిహద్దులో భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు గగనతల రక్షణ, ఫిరంగి వ్యవస్థలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రాజస్థాన్‌లోని బాడ్‌మెర్‌లోని లాంగేవాలా సెక్టార్‌కు అటువైపు ఉన్న ప్రాంతంలో రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను పాక్ అప్రమత్తం చేసినట్లు సమాచారం.

పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ ప్రస్తుతం మూడు సైనిక విన్యాసాలను ఒకేసారి నిర్వహిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎఫ్-16, ఎఫ్-10, ఎఫ్-17 తదితర యుద్ధ విమానాలతో వీటిని కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఏప్రిల్ 29 నుంచి ఇవి మొదలయ్యాయని, ఇందులో సాబ్ ఎయిర్‌బోర్న్ వార్నింగ్-కంట్రోల్ సిస్టమ్‌లతో కూడిన విమానాలూ ఉన్నట్లు తెలిసింది.

వైమానిక స్థావరాల భద్రత సహా క్షేత్రస్థాయి ఆస్తుల రక్షణ కోసం ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ ఫోర్స్‌ను పాకిస్థాన్ మోహరించింది. చైనాకు చెందిన ఎస్‌హెచ్-15 శతఘ్నులను పాక్ ఆర్మీ సమకూర్చుకోగా.. వాటిని ప్రస్తుతం సరిహద్దుకు తరలిస్తున్నట్లు తెలిసింది.

## టారిఫ్‌లపై చర్చిద్దాం రండి.. చైనాను సంప్రదించిన అమెరికా..!

టారిఫ్‌లపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. ఈ విషయాన్ని బీజింగ్‌కు చెందిన ఓ మీడియా సంస్థ వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పంపిణీ వ్యవస్థలు దెబ్బతినకుండా ఈ చర్యలు చేపట్టినట్లు అభివర్ణించింది.

ట్రంప్ సర్కారు ఇప్పటికే చైనా వస్తువులపై ఏప్రిల్‌లో 145శాతం సుంకాలు విధించింది. దీనికి ప్రతి స్పందనగా బీజింగ్ కూడా అగ్రరాజ్య వస్తువులపై 125శాతం సుంకాలను విధించింది. ఈ నేపథ్యంలో అమెరికా అధికారులు వివిధ మార్గాల్లో చైనీయులను సంప్రదించినట్లు సీసీటీవీ పేర్కొంది. సంప్రదింపుల కోసం అమెరికానే ఆత్రుతతో ఎదురు చూస్తోందని వెల్లడించింది. ట్రంప్ కార్యవర్గం తీవ్ర ఒత్తిడిలో ఉందని చెప్పింది. ఈ విషయంపై చైనా విదేశాంగశాఖ నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.

మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్ర స్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధవారం కూడా ఆయన మాట్లాడుతూ డీల్ కదుర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు.

# అటారీ-వాఘా సరిహద్దు మూసివేత..!




పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌లోని పాకిస్థాన్ జాతీయులు స్వదేశానికి వెళ్లాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకోసం వివిధ వీసాదారులకు విధించిన గడువు ఏప్రిల్ 30తో ముగిసింది. ఈ క్రమంలోనే వాఘా- అటారీ సరిహద్దును తాజాగా పూర్తిగా మూసేసినట్లు సంబంధిత వర్గాల వెల్లడించాయి. అయితే, అంతకుముందు ఈ గడువును ప్రభుత్వం సవరించిందనే వార్తలు వచ్చినప్పటికీ దీనిపై స్పష్టత లేదు.

“అటారీ-వాఘా సరిహద్దు ప్రస్తుతం పూర్తిగా మూసివేశారు. ఇరు దేశాల ప్రజలు రాకపోకలు సాగించే వీలులేదు” అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌లో ఉన్న 125 మంది పాకిస్థానీలు బుధవారం స్వదేశానికి వెళ్లిపోయారు. దీంతో గడిచిన ఏడు రోజుల్లో భారత్‌ను వీడినవారి సంఖ్య 911కు చేరినట్లు సమాచారం. మరోవైపు పాకిస్థాన్‌లో ఉన్న 15 మంది భారతీయులు సరిహద్దు దాటి స్వదేశానికి చేరుకున్నట్లు తెలిసింది.

## జీఎస్టీ వసూళ్లలో ఆల్‌టైమ్ రికార్డ్




దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ నెలలో ఈ మొత్తంగా రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా 2025 ఏప్రిల్ నిలిచింది.

గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. అంతకుముందు నెలలో (మార్చి) జీఎస్టీ వసూళ్లు 1.96 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ నెల మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 10.7 శాతం మేర పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం మేర పెరిగి రూ.46,913 కోట్లకు పెరిగింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

## జూన్ 16 నుంచి యూపీఐ లావాదేవీలు ఇక మరింత వేగంగా!

మనం ఎవరికైనా యూపీఐ పేమెంట్ చేశామనుకుందాం. ఆ లావాదేవీ విజయవంతంగా పూర్తవ్వడానికి కొంత సమయం పడుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాక 'సక్సెస్' అని సందేశం వస్తేనే దాన్ని వ్యాపారికి/ దుకాణదారుడికి చూపించాకే వెళుతుంటాం. కొన్నిసార్లు ఎక్కువ సమయమే వేచి చూడాల్సి వస్తుంటుంది. ఇకపై ఆ సమయం దాదాపు 50 శాతం మేర తగ్గనుంది. జూన్ 16 నుంచి సవరించిన సమయం అమల్లోకి రానుంది. ఈ మేరకు వివిధ రకాల యూపీఐ లావాదేవీల గడువును సవరిస్తూ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది.




ఒక లావాదేవీ పూర్తి కావడానికి పట్టే పూర్తి సమయాన్ని రెస్పాన్స్ టైమ్‌గా వ్యవహరిస్తారు. అంటే మనం ఏదైనా లావాదేవీ నిర్వహిస్తే దాని తుది సందేశం వచ్చేంత వరకు దాన్ని లావాదేవీ సమయంగానే వ్యవహరించాలి. ఎన్‌పీసీఐ తాజా ఆదేశాల ప్రకారం క్రెడిట్/ డెబిట్‌కు సంబంధించిన లావాదేవీల సమయం కేవలం 15 సెకన్లలోనే పూర్తి కానుంది. ప్రస్తుతం ఇది 30 సెకన్లుగా ఉంది. ఇదొక్కటే కాదు.. ట్రాన్సాక్షన్ స్టేటస్, ట్రాన్సాక్షన్ రివర్సల్, అడ్రస్ వ్యాలిడేషన్ సమయం కూడా 30 సెకన్ల నుంచి 10 సెకన్లకు తగ్గనుంది. యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను మెరుగుపరిచేందుకే ఈ మార్పులు చేపట్టినట్లు ఎన్‌పీసీఐ తన సర్క్యులర్‌లో పేర్కొంది. జూన్ 16 నుంచి రెస్పాన్స్ సమయం తగ్గేందుకు చర్యలు తీసుకోవాలని పేటీఎం, ఫోన్ పే వంటి పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, బ్యాంకులకు ఎన్‌పీసీఐ సూచించింది.

## టెస్లాకు కొత్త సీఈవో..! స్పందించిన ఎలాన్ మస్క్



ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా మారిన ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌ను టెస్లా సీఈఓ బాధ్యతల నుంచి తప్పించాలని కంపెనీ బోర్డు భావిస్తోంది. కొత్త వ్యక్తి నియామకం కోసం ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది.

ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, సాంకేతిక రంగాల్లో దిగ్గజ వ్యాపారవేత్తగా ఎదిగిన ఎలాన్ మస్క్ ట్రంప్ ప్రభుత్వంలో సంస్కరణల కోసం ఏర్పాటుచేసిన 'డోజ్' సారథిగా పని చేస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం కోసం శ్రమించిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు కీలక పదవి దక్కింది. అయితే ట్రంప్ పరిపాలనలో మస్క్ అధిక ప్రమేయం ఉందనే వాదనలతో పెద్దఎత్తున విమర్శలు ఎదుర్కొన్నారు. ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నారని, ఇందులో మస్క్ కీలక పాత్ర పోషించారని విమర్శలు వచ్చాయి. రాజకీయాల్లో అధిక జోక్యంతో ఈ కుబేరుడు తన వ్యాపారాలను పట్టించుకోవడం లేదని పెట్టుబడిదారులపై ఆందోళనలు ఎక్కువయ్యాయి. ఫలితంగా టెస్లా విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఈనేపథ్యంలో మస్క్‌ను తప్పించి వేరొకరికి ఆ బాధ్యతలు అప్పగించాలని బోర్డు సభ్యులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## రిటర్నులకు వేళాయె

ఆదాయపు పన్ను రిటర్నులకు సంబంధించి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) కీలక ప్రకటన చేసింది. ఐటీఆర్-1 (సహజ్), ఐటీఆర్-4లను నోటిఫై చేసింది. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్ 2025-26)గాను ఆదాయపు పన్ను రిటర్నులకు వీటిని ఉపయోగించేందుకు వీలవుతుంది. ఎక్స్ఛేంజీల్లో నమోదైన ఈక్విటీ షేర్లు, ఈక్విటీ-ఆధారిత మ్యూచువల్ ఫండ్లను విక్రయించడం ద్వారా రూ.1.25 లక్షల వరకూ దీర్ఘకాలిక మూలధన లాభాలు ఉన్న పన్ను చెల్లింపుదారులూ ఐటీఆర్-1, ఐటీఆర్-4లను ఉపయోగించవచ్చు.

ఐటీఆర్-1: దేశంలో నివసించే వ్యక్తి ఆదాయం రూ.50లక్షలున్న వారు, వేతనం, ఒక ఇంటి ద్వారా ఆదాయం, సెక్షన్ 11ఏ ప్రకారం రూ.1.25 లక్షల లోపు దీర్ఘకాలిక మూలధన లాభాలు, రూ.5,000 వరకూ వ్యవసాయ ఆదాయం ఉన్న వారికి వర్తిస్తుంది.

ఐటీఆర్-4: మొత్తం ఆదాయం రూ.50 లక్షల వరకూ ఉన్నవారు, వృత్తి, ఆదాయం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్న వారు, దీర్ఘకాలిక మూలధన లాభాలు రూ.1.25 లక్షల లోపు ఉన్నప్పుడు, సెక్షన్ 44ఏడీ, సెక్షన్ 44ఏడీఏ, సెక్షన్ 44ఏఈ కింద ఆదాయాలను గణించే వారు ఈ ఫారాన్ని వినియోగించాల్సి ఉంటుంది.

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి చివరి తేదీ జులై 31. వేతనాలు పొందే వారికి జూన్ 15 తర్వాతే ఫారం-16 అందే అవకాశం ఉంటుంది. వీరు అప్పుడే రిటర్నులు దాఖలు చేయడానికి వీలవుతుంది.

# భారీగా దిగొచ్చిన పసిడి ధర.. రూ.2వేల పైన తగ్గిన బంగారం

హైదరాబాద్: అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర గత కొన్ని రోజులుగా కాస్త దిగొస్తోంది. గురువారం ఒక్క రోజే 10 గ్రాముల పుత్తడి ధర దాదాపు రూ.2వేల పైన తగ్గింది. నేడు 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.2,180 తగ్గి రూ.95,730 (10 గ్రాములకు) పలుకుతోంది. దాదాపు 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది.

అటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర కాస్త దిగొచ్చింది. ప్రస్తుతం ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడం, రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందానికి సంకేతాలు కన్పించడం, డాలర్ విలువ బలపడుతుండటంతో పుత్తడికి గిరాకీ తగ్గినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో వరుసగా రెండో రోజు పుత్తడి ధర దిగొచ్చినట్లు పేర్కొంటున్నారు. త్వరలోనే అమెరికా ఆర్థిక గణాంకాలు వెలువడున్నాయి. ఇవి కూడా పసిడి ధరలపై ప్రభావం చూపే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా.. అక్షయ తృతీయ సందర్భంగా దేశీయ మార్కెట్లో బుధవారం బంగారానికి గిరాకీ పెరిగింది. అక్షయ తృతీయ విక్రయాలు రూ.12,000 కోట్ల విలువైన 12 టన్నుల పసిడి, రూ.4,000 కోట్ల విలువైన వెండి కలిపి మొత్తంగా రూ.16,000 కోట్లుగా ఉండొచ్చని ఆలిండియా జువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు పంకజ్ అరోరా వెల్లడించారు.



# రూ.8,50,000 కోట్లకు దేశీయ మీడియా, వినోద పరిశ్రమ

## వచ్చే దశాబ్దకాలంలో చేరుతుంది: ముకేశ్ అంబానీ



ముంబయి: రాబోయే దశాబ్దకాలంలో భారత మీడియా, వినోద పరిశ్రమ పరిమాణం మూడింతలకు పైగా పెరిగి 100 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.8,50,000 కోట్లు) చేరగలదని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఛైర్మన్ ముకేశ్ అంబానీ తెలిపారు. లక్షల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా.. ఈ పరిశ్రమ వృద్ధి ప్రభావం ఇతర రంగాలకూ వ్యాపిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో దిగ్గజ మీడియా సంస్థల్లో ఒకటైన నెట్‌వర్క్ 18తో పాటు పలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, వినోద ఛానళ్లు, కంటెంట్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఆర్ఐఎల్ గ్రూపు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచ వినోద రంగానికి ముఖ్య కేంద్రంగా అవతరించేందుకు భారత్‌కు ఎంతో సమయం పట్టదని గురువారమిక్కడ జరిగిన 'వేవ్స్ 2025' సదస్సులో అంబానీ పేర్కొన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించాక.. దేశ మీడియా, వినోద రంగం ప్రపంచంలోనే అగ్రగామిగా అవతరించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంకా ఏమన్నారంటే...

ప్రస్తుతం భారత మీడియా, వినోద పరిశ్రమ విలువ 28 బిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.2,40,000 కోట్లు) ఉంది. వచ్చే దశాబ్దకాలంలో 100 బిలియన్ డాలర్లకు పైగా పెరిగే సామర్థ్యం ఈ పరిశ్రమకు ఉంది. మరింత మంది వ్యాపారాల్లోకి అడుగుపెట్టేందుకు, లక్షల ఉద్యోగాల సృష్టికి ఈ వృద్ధి దారి చూపుతుంది.

డిజిటల్ రంగంలో భారత్ అగ్రగామిగా అవతరించింది. కథా సృష్టి సామర్థ్యం, డిజిటల్ సాంకేతికతల కలయిక భారత్‌కు మాత్రమే సొంతం. కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికతలు మన కథలను మునుపెన్నడూ లేనంతగా మరింత ఆసక్తిగా మార్చగలవు. వివిధ భాషలు, దేశాలు, సంస్కృతులకు చెందిన ప్రేక్షకుల చెంతకు వేగంగా కూడా తీసుకెళ్లగలవు. ఈ కొత్త సాంకేతికతలను ఆయుధంగా మల్చుకొని మన దేశంలోని అత్యుత్తమ నైపుణ్యమున్న యువ సృజనకారులు బ్లాక్‌బస్టర్స్‌తో ప్రపంచ వినోద పరిశ్రమను ఏలుతారు.




## కాగ్నిజెంట్ గుడ్‌న్యూస్.. 20 వేల మంది ఫ్రెషర్ల నియామకం

అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ గుడ్‌న్యూస్ చెప్పింది. భారత్‌లో అత్యధికంగా ఉద్యోగులను కలిగిన ఆ సంస్థ.. ఈ ఏడాది 20 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. గడిచిన త్రైమాసికంలో పెద్దగా నియామకాలు చేపట్టిన ఆ సంస్థలో ప్రస్తుతం 3,36,300 ఉద్యోగులు పనిచేస్తున్నారు. వృద్ధిని, ఆవిష్కరణలపై కంపెనీ దృష్టి సారించిన నేపథ్యంలో ఫ్రెషర్లను నియమించుకోవాలని చూస్తోంది. తమ వ్యూహంలో భాగంగా ఈ ఏడాది 20 వేలమంది ఫ్రెషర్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ ఎస్ తెలిపారు.

కంపెనీ టాలెంట్ పిరమిడ్‌ను మరింత బలోపేతరం చేసే ఉద్దేశంతో ఫ్రెష్ గ్రాడ్యుయేట్లను తీసుకోవాలనుకుంటున్నట్లు రవి కుమార్ చెప్పారు. ముఖ్యంగా గడిచిన రెండేళ్లలో మేనేజ్డ్ సర్వీసులకు సంబంధించిన ప్రాజెక్టులు పెరిగిన వేళ నియామకాల్లో జోరు పెంచాలని కంపెనీ భావిస్తోందన్నారు. కొత్తగా ఫ్రెషర్లను నియమించుకోవడం, ఏఐ ద్వారా ఉత్పాదకత పెంచుకోవడం, మానవ మూలధన వ్యయాలను సమర్థంగా వినియోగించుకోవడం వంటి మూడు అంశాలపై కంపెనీ దృష్టి సారించినట్లు రవి కుమార్ పేర్కొన్నారు. కాగ్నిజెంట్‌లో సుమారు 14 వేల మంది మాజీ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరగా.. మరో 10 వేల మంది త్వరలో చేరనున్నట్లు తెలిపింది.

# మరో 18 నెలల్లో.. ఇక మా కోడింగ్ పనంతా కృత్రిమ మేధదే..!

## జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు

కృత్రిమ మేధ టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. సర్వం ఏఐమయమౌవుతుందన్న వాదనల నేపథ్యంలో ఈ సాంకేతికతపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మరో 18 నెలల్లో తమ కంపెనీకి చెందిన కోడింగ్ కృత్రిమ మేధనే చేస్తుందన్నారు.

తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న జుకర్‌బర్గ్ మెటాలో కృత్రిమ మేధ పాత్ర గురించి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పటికే ఓ బృందంలో సభ్యుడిగా విధులు నిర్వహిస్తోందన్నారు. త్వరలోనే టాప్ కోడర్ల కంటే ఏఐ మెరుగ్గా పనిచేస్తుందంటూ వ్యాఖ్యానించారు. మీరు ఏదైనా లక్ష్యాన్ని ఇస్తే.. ఏఐ ఆ పనిని సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. బగ్‌లను కనుగొంటూ, అధిక- నాణ్యత కోడ్‌ను స్వతంత్రంగా రాయగలదని జుకర్‌బర్గ్ భావించారు. రానున్న 12-18 నెలల్లో తమ కంపెనీకి చెందిన లామా ప్రాజెక్ట్‌కు సంబంధించి చాలావరకు కోడింగ్‌ను ఏఐయే పూర్తిచేస్తుందని జుకర్‌బర్గ్ అభిప్రాయపడ్డారు.



## కమర్షియల్ సిలిండర్ ధర తగ్గింపు.. ఏటీఎఫ్‌లోనూ కోత




హోటళ్లు, రెస్టరంట్లలో వినియోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. ఒక్కో సిలిండర్‌పై రూ.14.50 తగ్గిస్తున్నట్లు ప్రభుత్వరంగ చమురు కంపెనీలు ప్రకటించాయి. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ఈ సవరణ చేపట్టాయి. ఇంట్లో వినియోగించే సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. మరోవైపు విమాన ఇంధన ధరలనూ చమురు కంపెనీలు తగ్గించాయి. దేశ రాజధాని దిల్లీలో కిలో లీటరుకు 4.4 శాతం మేర తగ్గించాయి. అంటే రూ.3,954 మేర తగ్గింది. దీంతో కిలోలీటర్ 85,486.80కు దిగొచ్చింది. ఏప్రిల్ 1న కూడా ఏటీఎఫ్ ధరల్ని 6.15 శాతం (రూ.5,870) మేర చమురు కంపెనీలు తగ్గించాయి. ఏటీఎఫ్ ధరలు తగ్గడం వరుసగా ఇది రెండోసారి. తగ్గిన ధరలతో ఆ మేర విమానయాన సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.




జపాన్‌కు చెందిన ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ కవాసకి భారత మార్కెట్‌లోకి వెర్సిస్ 650 2025 మోడల్‌ను విడుదల చేసింది. ఈ అడ్వెంచర్ టూరింగ్ మోటార్‌సైకిల్ ధరను రూ.7.93 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఓబీడీ-2బి ఉద్గార ప్రమాణాలతో దీన్ని తీసుకొచ్చారు. 2024 మోడల్‌తో పోలిస్తే దీని ధర రూ.16వేలు అధికం. ప్రస్తుతం పాత మోడల్‌ను రూ.30 వేల వరకు డిస్కౌంట్‌కు విక్రయిస్తున్నారు.


**ఇక బైక్ వివరాల్లోకి వెళితే..** కవాసకి వెర్సిస్ కొత్త రంగులు మినహా డిజైన్ పరంగా పెద్దగా మార్పులు చేయలేదు. ఈ మోటార్ సైకిల్ 649 సీసీ లిక్విడ్ కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజిన్‌తో వస్తోంది. ఇది 8500 ఆర్‌పీఎం వద్ద 66 హెచ్‌పీ పవర్‌ను, 7000 ఆర్‌పీఎం వద్ద 61 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ గేర్ బాక్స్ ఉంది. ఈ మోటార్ సైకిల్ బరువు 218 కేజీలు. ముందువైపు 300 ఎంఎం డిస్క్, వెనకవైపు 250 ఎంఎం డిస్క్ బ్రేక్ ఉన్నాయి. దీని ఫ్యూయల్ ట్యాంక్ కెపాసిటీ 21 లీటర్లు. మార్కెట్‌లో ప్రస్తుతం ట్రయంఫ్ టైగర్ స్పోర్ట్ 660కి గట్టి పోటీనిస్తుంది. అయితే, ట్రయంఫ్ టైగర్ స్పోర్ట్ ధర రూ.9.45 లక్షలుగా ఉంది.

# అప్పులు తీర్చడానికే నటుడినయ్యా



తమిళ హీరో అజిత్‌కుమార్ ఇటీవలే న్యూఢిల్లీలో పద్మభూషణ్ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. సినిమాల్లోకి యాక్టర్‌గా రావడం వెనుకున్న పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "అసలు నాకు సినిమాల్లోకి రావాలనే ఉద్దేశం ఏనాడూ లేదు. అనుకోకుండా యాక్టర్ అయ్యా. మొదట్లో నా నటన ఘోరంగా ఉండేది. కెరీర్ తొలినాళ్లలో నేను చేసిన సినిమాలకు వేరేవారు డబ్బింగ్ చెప్పేవారు. ఆ తర్వాత కఠోర సాధనతో నన్ను నేను చాలా మెరుగుపరుచుకున్నా. ఇప్పటికీ కొందరు మిమిక్రీ ఆర్టిస్టులు మొదట్లో నేను చేసిన పేలవ నటన ఆధారంగా మిమిక్రీ చేస్తుంటారు. నిజానికి నాకు రేసర్ కావాలనే అశ ఉండేది. రేసింగ్ కోసం డబ్బులు సమకూర్చుకునే పనిలో మోడలింగ్ అవకాశం వచ్చింది. ఆ క్రమంలోనే సినిమా అవకాశాలూ వచ్చాయి. ఎవరైనా ఏదైనా అడిగితే నిజాయితీగా సమాధానం చెప్పేవాడ్ని. అప్పట్లో ఓ విలేకరి 'మీరు యాక్టింగ్‌ను ఎందుకు ఎంచుకున్నారు' అని అడిగారు. 'వ్యాపారంలో నష్టం వచ్చింది. నాకున్న అప్పులు తీర్చడానికి ఇండస్ట్రీలోకి వచ్చా' అని తడుముకోకుండా చెప్పేశా".



# మా అంకుల్ చిరంజీవి నా ఇన్‌స్పిరేషన్

## 'వేవ్స్'లో అల్లు అర్జున్

మానసిక ప్రశాంతతే తన ఫిట్‌నెస్‌కు కారణమని ప్రముఖ హీరో అల్లు అర్జున్ పేర్కొన్నారు. సిక్స్‌ప్యాక్ కోసం గతంలో చాలా కష్టపడ్డానని చెప్పారు. ముంబయిలో గురువారం ప్రారంభమైన 'వేవ్స్'లో ఆయన మాట్లాడారు. "'వేవ్స్' నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. బాల్యం నుంచే నాకు డ్యాన్స్ ఇష్టం. నా సినీ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు అధిగమించా. సినిమానే నా ప్రపంచం. అది తప్ప మరో ఆలోచన లేదు. ఎంతోమంది నాపై చూపించిన అభిమానం వల్లే ఈ స్థాయికి చేరుకున్నా. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది" అని పేర్కొన్నారు. చిరంజీవి గురించి మాట్లాడుతూ.. "మా అంకుల్ చిరంజీవి నాకు స్ఫూర్తి. ఆయన ప్రభావం నాపై ఎంతో ఉంది" అని పేర్కొన్నారు. తదుపరి సినిమా #AA22 (వర్కింగ్ టైటిల్)పై స్పందించారు. దర్శకుడు అట్లీ చెప్పిన ఐడియా తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. విజువల్ ఎఫెక్ట్స్‌లో ప్రేక్షకులకు కొత్త అనుభూతి పంచుతుందన్నారు.

మే 4 వరకు కొనసాగనున్న ఈ వేడుకలో చిరంజీవి, రజనీకాంత్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్ తదితర హీరోలతోపాటు ఇతర రంగాల ప్రముఖులూ నేడు హాజరయ్యారు. ఆ వేదికపై పలువురు సినీ సెలబ్రిటీలు పంచుకున్న సంగతులివీ..

**మోదీ ఫైటర్: రజనీకాంత్**

"ఇటీవల చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ సదస్సు వాయిదా పడే అవకాశాలున్నాయని చాలామంది అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై నమ్మకంతో ఈ సమ్మిట్ అనుకున్న సమయానికే జరుగుతుందని అనుకున్నా. మోదీ ఏ ఛాలెంజ్‌నైనా స్వీకరిస్తారు. కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొంటుంది. మోదీ ఓ ఫైటర్. వేవ్స్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఈ వేడుక నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు" అని రజనీకాంత్ పేర్కొన్నారు.

**ఆ వేదికే ఈ వేవ్స్: రాజమౌళి**

"మన దేశంలో చాలా భాషలున్నాయి. ఒక్కో దానికి వందేళ్లకుపైగా చరిత్ర ఉంది. ఎన్నో కళలున్నాయి. లెక్కలేనన్ని కథలున్నాయి. కథల విషయంలో ఏ దేశం ఇండియాకు సాటి రాదు. కానీ, అంతర్జాతీయంగా యూఎస్ఏ, సౌత్ కొరియా, చైనా తదితర దేశాలతో మనం సమానంగా లేం. మన శక్తిపై నాకెలాంటి సందేహం లేదు. కానీ, మనకు ఓ గొప్ప వేదిక అవసరం. అలాంటిదే ఈ 'వేవ్స్'" అని దర్శకుడు రాజమౌళి అభిప్రాయం వ్యక్తం చేశారు.


**అనుకున్న టైమ్‌కి వేవ్స్: షారుక్‌ఖాన్**

"ఫిల్మ్ ఇండస్ట్రీ స్టేటస్ కోరుకునే సమయంలో 'వేవ్స్' వచ్చింది. ఇలాంటి వేడుకల వల్ల భారతీయ సినిమాలు ప్రపంచ స్థాయిలో మరింత ఆదరణ దక్కించుకుంటాయి. థియేటర్లకు వచ్చే ప్రేక్షకులకు టికెట్టు ధరలు అందుబాటులో ఉండాలి" అని షారుక్‌ఖాన్ అన్నారు. సోషల్ మీడియా వినియోగంపై మాట్లాడుతూ.. "సామాజిక మాధ్యమాల్లో కనిపించాలని చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. ఆ ధ్యాసలో ఎవరేంటన్నది మర్చిపోతున్నారు. దాని బదులు పనిపై దృష్టిసారించి, మనల్ని మనం చూసుకుందాం" అని సలహా ఇచ్చారు.

**ఒక్కటే సినిమా: మోహన్‌లాల్**

"మలయాళ చిత్ర పరిశ్రమ కళలకు నిలయం. వినోదాన్ని అందించడమే కాకుండా కమర్షియల్‌గానూ విజయాన్ని అందుకున్న ఎన్నో అద్భుతమైన చిత్రాలు రూపొందాయి. నా 47 ఏళ్ల సినీ ప్రయాణంలో ఎంతో మంది గొప్ప దర్శకులతో పనిచేసే అవకాశం లభించింది. యువ దర్శకులతోనూ వర్క్ చేస్తున్నా. ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్నా మా చిత్రాలను ప్రేక్షకులు ఆర్ట్ ఫిల్మ్స్ అని పిలిచేవారు. కాబట్టి, ఆర్ట్, ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్స్ అంటూ వేరు చేసి చెప్పలేను. సినిమా అంతా ఒక్కటే" అని మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్ పేర్కొన్నారు.






# ఆశిష్.. దేత్తడి

ఆశిష్ హీరోగా ఆదిత్యరావు గంగసాని దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. దీన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 60వ సినిమాగా దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'దేత్తడి' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు గురువారం ఈ చిత్ర టైటిల్ లుక్‌ను విడుదల చేశారు. అందులో ఆశిష్ హుషారుగా డప్పు కొడుతూ చిందేయడం కనిపించింది. "హైదరాబాద్ నేపథ్యంగా సాగే రొమాంటిక్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. సంగీతానికి చాలా ప్రాధాన్యముంది. బలమైన భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. దీంట్లో ఆశిష్ మాస్ లుక్‌లో కనిపించడంతో పాటు హైదరాబాదీ యాసలో సంభాషణలు పలకనున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

# నేను కరెక్ట్ అని ప్రేక్షకులు మళ్లీ నిరూపించారు: నాని



'హిట్: ది థర్డ్ కేస్'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు కథానాయకుడు నాని. ఆయన.. శ్రీనిధి శెట్టి జంటగా శైలేశ్ కొలను తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఇది గురువారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్ మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా కథానాయకుడు నాని మాట్లాడుతూ.. "బుకింగ్స్ అదిరిపోయాయి. ఓపెనింగ్స్ బాగున్నాయి. ప్రేక్షకులు, పరిశ్రమ వర్గాల నుంచి మంచి టాక్ వస్తోంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో ఇదెంత దూరం వెళ్లి ఆగుతుందన్నది మా అంచనాలకీ అందట్లేదు. ఇది ఈ నెలంతా ఓ వేడుకలా కొనసాగుతుందని నమ్ముతున్నా. 'నేను, మీరు ఒకటేన'ని నేను నమ్మిన ప్రతిసారీ 'నేను కరెక్ట్' అని మీరు నిరూపించినందుకు ప్రతిఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు" అన్నారు. "నన్ను నమ్మినందుకు నానికి థ్యాంక్స్. నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాననుకుంటున్నా. ఈ చిత్రం కోసం మేమంతా చాలా కష్టపడ్డాం" అన్నారు దర్శకుడు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ రోజు తెలుగు చిత్ర పరిశ్రమ మళ్లీ ఊపిరి పీల్చుకుంది. సినిమాలొస్తున్నాయి.. కానీ, జనాలు థియేటర్లకు రావట్లేదు.. వేసవి అంతా అయిపోతోంది.. ఏపీ, తెలంగాణల్లో చాలా చోట్ల సింగిల్ స్క్రీన్లు మూసేశారు అనుకుంటున్నాం. ఇలాంటి తరుణంలో మేమంతా 'హిట్ 3'పైనమ్మకం పెట్టుకున్నాం. దీనికి ప్రేక్షకులొస్తారా? ఏస్థాయిలో థియేటర్లు నిండుతాయని ఊపిరి బిగబట్టుకుని చూశాం. అలాంటిది మూడు నాలుగు రోజుల ముందు నుంచే ఆన్‌లైన్ బుకింగ్స్‌తో నమ్మకం వచ్చింది. నాని నిర్మాతగా ఇప్పటికే ఓ విజయాన్నిచ్చాడు. ఇప్పుడు హీరోగా.. నిర్మాతగా మరో సూపర్ హిట్ ఇచ్చాడు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,